
# నెహెమ్యా గ్రంథ ధ్యానము




రచయిత :
బ్రదర్. టి.పి. వరప్రసాదరెడ్డి
షాలోం క్రిస్టియన్ అసెంబ్లీ
# 1/183, విద్యానగర్, J.N.T.U.C. పోస్టాఫీసు,
అనంతపురము - 2. (A.P.) S. India
Cell : 94402 85883, 94406 69494

# నెహెమ్యా గ్రంథ ధ్యానము

రచయిత :

**టి.పి. వరప్రసాద రెడ్డి**

పబ్లిషర్స్ :

**షాలోమ్ క్రిస్టియన్ అసెంబ్లీ**

**1/183, విద్యానగర్, JNTUC పోస్టాఫీసు,**

**అనంతపురము– 515 002. (ఏ.పి.), సౌత్ ఇండియా**

**సెల్ : 9440285883, 9440669494**

**NEHEMYA GRANDHA DHYAANAMU**

Bro. T.P. Vara Prasada Reddy

© All Rights Reserved with publishers
Any part of this book not to be copied

1st Edition : 8-4-2021

**Price Rs. 50-00**

Copies Available at :

1) Logos Book Centre
   10/1, Arundalpet, Guntur - 522 002.
   H 0863 - 2336027, Cell : 94402 60004

2) T.P. Varaprasada Reddy
   Shalom Church
   J.N.T.U. Post, Ananthapur - 515 002.
   Cell : 9440285883

3) Moreh Christian Assembly
   1088, 3rd Phase, K.P.H.B. Colony,
   Hyderabad - 72.
   Cell : 9866604438

4) T. P. Rathna Reddy,
   Manager, Muthoot Finance,
   Giddalur. Prakasam Dt.
   Cell : 9490000789

Printed & Published by :

**T.P. VARAPRASADA REDDY**

**SHALOM CHURCH**

J.N.T.U. Post, **ANANTHAPUR** - 515 002.

Cell : 9440285883, 9440469046, 9440669494

# నెహెమ్యా గ్రంథ విభజన

## విషయసూచిక

**అంశము : యెరూషలేము పట్టణము యొక్క ప్రాకారము కట్టబడుట.**


| | | |
|---|---|---|
| 1) | 1-6అ. యెరూషలేము ప్రాకారము కట్టుట | |
| 2) | 1-2అ. యెరూషలేము ప్రయాణము | 15 |
| 3) | 1అ. పనికి సిద్ధపడుట | 15 |
| 4) | 2అ. పనికి ప్రయాణము | 17 |
| 5) | 3అ. పని ప్రారంభము | 20 |
| 6) | 4-5అ. పనికి ఆటంకాలు | |
| | 4. తిరస్కాములమధ్య యెరూషలేము ప్రాకార గోడ కట్టబడుట | |
| | 5. స్వజనుల ఆటంకముల మధ్య పని కొనసాగుట | 29 |
| 7) | 6అ. పని సమాప్తము (6:15వ.) | 31 |
| 8) | 7-13అ. అలంకరణ - దిద్దుబాటు | |
| 9) | 7అ. పనివారల అలంకరణ | 33 |
| 10) | 8. ప్రజలలో బ్రహ్మాండమైన ఉజ్జీవము కలుగుట | 36 |
| 11) | 9అ. ప్రార్థన | 39 |
| 12) | 10-13అ. పవిత్రత - ప్రతిష్ఠిత - దిద్దుబాటు | |
| 13) | 10అ. యూదులుచేసిన నిబంధనలు, నిర్ణయములు | 43 |
| 14) | 11అ. ప్రాకార ప్రతిష్టత | 47 |
| 15) | 12అ. ప్రధానులైన యాజకులు లేవీయులు సమకూడి ప్రాకారమును ప్రతిష్ఠించుట | 48 |
| 16) | 13అ. అన్య స్త్రీలను వివాహము చేసికొనినవారిని దిద్దుట | 51 |
| 17) | వాక్యానుసారమైన విశ్వాసుల వివాహము - కుటుంబ జీవితములు కట్టబడుట | 54 |

# నెహెమ్యా గ్రంథము పరిచయము

నెహెమ్యా గ్రంథ ధ్యానము కంటే ముందుగా పాతనిబంధన గ్రంథ సంక్షిప్త వివరణ, ఎజ్రా గ్రంథ పరిచయము కూడా చూద్దాము. ఆదికాండమునందు ఆదాము నుండి యోసేపు వరకు వ్రాయబడింది. క్రీ.పూ. 1800–1400 వరకు ఐగుప్తువారు ప్రపంచమును పాలించిరి. మోషే నిర్గమకాండము మొదటిలో ఐగుప్తులో జన్మించాడు. ఆదాము నుండి మోషే పుట్టుక వరకు దాదాపు 2600 సంవత్సరములు (క్రీ.పూ. 4000–1400) దేవుడు మనసాక్షితోను, మానవ పాలనతోను కుటుంబ పితరుల నాయకత్వముతోను ప్రజలను నడిపించారు.

తర్వాత నిర్గమ కాండమునుండి ద్వితీయోపదేశకాండము వరకు క్రీ.పూ. 1440లో 80 ఏండ్ల వయసులోనున్న మోషే నాయకత్వంలో 40 ఏండ్లు (క్రీ.పూ. 1440–1400) దేవుడు తన ప్రజలను అరణ్యములో నడిపించాడు.

1. క్రీ.పూ. 1440 మొదటి సం॥ ఆరవనెల ప్రారంభము నుండి పంద్రెండవ నెల వరకు ఏడు నెలల కాలములో ప్రత్యక్ష గుడారము మోషే ద్వారా నిర్మించబడెను. యెహోషువ ద్వారా సుమారు 25–30 ఏండ్లు (1400–1370) దేశమును స్వతంత్రించుకొనునట్లు చేసాడు. తర్వాత సుమారు 310 సంవత్సరాలు న్యాయాధిపతుల గ్రంథంలోనున్న న్యాయాధిపతుల ద్వారాను, చివరి న్యాయాధితియైన సమూయేలు వరకు సుమారు 350 ఏండ్లు (క్రీ.పూ 1870–1020) తన ప్రజలను కాపాడాడు.

ప్రజల కోరికపై సౌలును రాజుగా చేసి 40 సంవత్సరాలు (క్రీ.పూ. 1050–1010) గిబియా నుండి పరిపాలించాడు. తదుపరి దావీదును ఎన్నుకొని 40 సంవత్సరాలు (క్రీ.పూ. 1010–970) హెబ్రోను, యెరూషలేము నుండి పాలించాడు. దావీదు పితరుల కుటుంబ చరిత్ర రూతు గ్రంథమందు కలదు. పిమ్మట సొలొమోనును నియమించి మరి 40 సంవత్సరాలు (క్రీ.పూ. 970–930) పరిపాలించాడు. 2) సొలొమోను తన పాలనలో నాల్గవ సం॥ నుండి 11 సం॥ వరకు అనగా క్రీ.పూ. 967–960 వరకు ఏడేండ్లలో యెరూషలేములో మందిరమునకు కట్టాడు. సౌలు, దావీదు, సొలొమోను పరిపాలనలు సమూయేలు రెండు గ్రంథాలలోను, మొదటి రాజులలోను కలవు.

తర్వాత క్రీ.పూ. 930/933లో రాజ్యము రెండు భాగాలైంది పైన ఉన్న 10 గోత్రముల ఇశ్రాయేలు వారిని షోమ్రోను, తిర్సాల నుండి 19 మంది రాజుల ద్వారా 210 సంవత్సరాలు (క్రీ.పూ. 933-721) పాలించాడు. వీరందరు విగ్రహారాధికులైనందున యెషయా, హెూషేయా, ఆమోసు, మీకాల ద్వారా ప్రవక్తల గ్రంథములందు హెచ్చరించాడు. అయినను మారుమనస్సు పొందనందున దేవుడు వీరిని క్రీ.పూ. 732, 721లలో రెండు విడతలుగా అష్షూరు చెరకు అప్పగించాడు. వీరు నేటికి తిరిగిరాలేదు. యూదా వారిని కూడా మూడు దఫాలుగా (క్రీ.పూ. 606, 597, 586) చెరకు పంపాడు. మొదటి చెరలో (క్రీ.పూ. 606) ప్రముఖులైన దానియేలు, షద్రకు, మేషాకు, అబెద్నెగో ఉన్నారు. (దాని 1:1-7) రెండవసారి చెరలో (597) అత్యంత ప్రముఖుడైన యెహెజ్కేలు ఉన్నాడు. (యెహె 40:1) మూడవ విడత చెరలో (586) మందిరము, యెరూషలేము ప్రాకారము పడగొట్టబడ్డాయి. వీరి పాపాల గురించి, చెరల గురించి యెషయా, యిర్మీయా, విలాప వాక్యములు, యెహెజ్కేలు, దానియేలు, యోవేలు, హబక్కూకు, జెఫన్యా ప్రవక్తల గ్రంథాలలో కలవు. బబులోను పాలన తరువాత మాదీయ పారశీకులు క్రీ.పూ. 536-330 వరకు ప్రపంచమును పాలించిరి. బబులోను చెర ముగిసిన పిదప క్రీ.పూ. 536లో జెరుబ్బాబేలు, యెహెూషువల నాయకత్వంలో దాదాపు 50 వేల మంది యూదులను, ఎజ్రా 2వ. అధ్యాయములలో యెరూషలేముకు 1000 మైళ్ళు నడిపించాడు. క్రీ.పూ. 535లో పారశీక రాజైన కోరేషు ఆజ్ఞ ప్రకారము మందిరము పునాది 3వ అధ్యాయములో వేయబడింది. శత్రువుల వలన నాల్గవ అధ్యాయములో పని ఆగింది. 15 సంవత్సరముల తర్వాత క్రీ.పూ. 520లో హగ్గయి, జెకర్యాల ప్రోత్సాహంతో ఆగిన పనిని ఐదవ అధ్యాయంలో తిరిగి ప్రారంభించారు.

3) క్రీ.పూ. 536-515 వరకు జెరుబ్బాబేలుచే 20 ఏండ్లు మందిరము నిర్మించబడింది. 6వ అధ్యాయములో మందిరము ప్రతిష్టించబడింది. (ఎజ్రా 6:15) క్రీ.పూ. 465లో అర్తహస్త రాజయ్యాడు. ఇతని పరిపాలనలో క్రీ.పూ. 457లో ఎజ్రా 1756 మంది పనివారితో వచ్చి ఏడవ అధ్యాయము నుండి 8వ అధ్యాయము వరకు మందిరమును అలంకరించి, పనివారలను నియమించుటకు దేవుడు తోడ్పడ్డాడు. 9-10 అధ్యాయములలో ప్రార్థనతో అన్యులను వివాహము చేసికొనిన యూదావారి జీవితములు దిద్దబడినవి. వివరములు ఎజ్రా గ్రంథము 10వ అధ్యాయమునందు కలవు.

క్రీ.పూ. 445లో నెహెమ్యా అర్తహషస్త రాజాజ్ఞతో యెరూషలేము పట్టణ ప్రాకారము నెహెమ్యా 3 అధ్యాయములో కట్టనారంభింప చేశాడు. ఆటంకముల మధ్య పని 4-5 అధ్యాయములలో జరిగింది. ఆరవ అధ్యాయములో 52 దినములలో ప్రాకారము కట్టి ముగించుటకు దేవుడు కృపనిచ్చాడు (నెహె 6:15). నెహెమ్యా ద్వారా 7-8 అధ్యాయములలో పనివారిని నియమించి, అతని ప్రార్థన ద్వారా 9-10 అధ్యాయములలో వారి జీవితములు దిద్దాడు. కొద్దికాలము అర్తహషస్త రాజు దగ్గరకు వెళ్ళిన నెహెమ్యా రెండవసారి తిరిగి క్రీ.పూ. 432లో యెరూషలేముకు వచ్చాడు. యాజకుడగు ఎల్యాషీబు తన కుమారునికి అమ్మోనీయుడగు టోబీయా కుమార్తెతో వివాహము జరిపించి టోబీయాతో బంధుత్వము చేసికొన్నాడు. క్రీ.పూ. 457లో ఎజ్రా ద్వారా యూదావారి జీవితములు దిద్దబడినను ఈ రీతిగా మరలా అన్యునితో వివాహములు చేసుకొని దోషులైరి. క్రీ.పూ. 424 వరకు నెహెమ్యా మరలా సవరించిన అనేక సంగతులు నెహెమ్యా గ్రంథములోని 11-13 అధ్యాయములలో పొందుపరచబడ్డాయి. 11-13అ. గాయకులు అందరు కలసి స్థిరమైన నిబంధన చేసి వ్రాసుకొని ముద్ర వేయుట. 11 అ. అధికారులు, పనివారలు యెరూషలేములోనే నివసించుటకై తీర్మాణము చేసుకొనిరి. (1వ.) 12అ. ప్రాకారములను క్రొత్త గీతములతో ప్రతిష్ఠించుకొనుట. (47వ.) 13అ. క్రీ.పూ. 432లో నెహెమ్యా, అర్తహషస్తరాజును దర్శించి యెరూషలేముకు తిరిగివచ్చి మందిరంలోని యాజకుల, లేవీయుల పోషణ విషయమై దిద్దుబాటును క్రీ.పూ. 424 వరకు జరిగించెను. (13వ.) నెహెమ్యా గ్రంథ విభజన ప్రక్క పేజిలోని నెహెమ్యా గ్రంథ పరిచయ చార్టులో చెప్పబడినది.

6వ అధ్యాయములో 2 వచనములు, 7వ అధ్యాయములో 65 వచనములు, 8వ అధ్యాయములో 4 వచనములు, 10వ అధ్యాయములో 26 వచనములు, 11వ అధ్యాయములో 34 వచనములు, 12వ అధ్యాయములో 38 వచనములు, మొత్తముగా 169 వచనములలో కేవలము పేరులు మాత్రమే కలవు. యూదుల పేరులు అర్థము కలిగినవైనందున వాటినుండి ఆత్మీయ పాఠములు నేర్చుకొనగలము.

# నెహెమ్యా మందిర ప్రాకారాన్ని కట్టుట

ఫ్లేవియస్ జోసిఫస్ అనే యూదా చరిత్రకారుడు యెరూషలేము పట్టణము యొక్క ప్రాకారము పనిని గూర్చి వ్రాసిన వాస్తవములను గమనింతము.

ఎజ్రా క్రీ.పూ. 457లో అలంకరించిన మందిరమున్న యెరూషలేము పట్టణము యొక్క ప్రాకారమును క్రీ.పూ. 446లో నెహెమ్యా కట్టాడు. ముందుగా నెహెమ్యా గ్రంథము మొదటి అధ్యాయములో నెహెమ్యా ప్రాకారమును గూర్చి విని 1) ఏడ్చి 2) కొన్ని దినములు దు:ఖముతో ఉపవాసముండి 3) విజ్ఞాపన చేసాడు.

తరువాత నెహెమ్యా గ్రంథము రెండవ అధ్యాయములో అర్తహషస్త రాజుకు మనవి చేసాడు. రాజు యెరూషలేము పట్టణము యొక్క ప్రాకారమును కట్టుటకై నెహెమ్యాను పంపుటకు ఇష్టపడి యెరూషలేముకు పంపాడు.

నెహెమ్యా రాజాజ్ఞతో బబులోనును ఏప్రిల్ 8 క్రీ.పూ. 445లో విడిచి యెరూషలేమును ఆగష్టు 4 క్రీ.పూ. 445న చేరాడు. ప్రయాణం 119 రోజులు సాగింది. అనగా 3 నెలల 28 రోజులకు యెరూషలేముకు చేరాడు. మందిరమున్న యెరూషలేము పట్టణము యొక్క ప్రాకారము పని నెహెమ్యా 3:1వ.లో ఆగష్టు 8, క్రీ.పూ. 445లో ప్రారంభించాడు. నెహెమ్యా 6:15వ.లో ఏలూలు మాసమున ఇరువది అయిదవ దినమందు, అనగా ఏబది రెండు దినములకు ప్రాకారము కట్టుపని ముగించాడు.

ఆగష్టు 8 ప్రారంభమైన పని అక్టోబర్ 2 క్రీ.పూ. 445లో ముగించబడినది. ఈ విధముగా 52 దినములలో పని సమాప్తమైనది. ఫ్లేవియస్ జోసిఫస్ అనే యూదా చరిత్రకారుడు ప్రాకారపు గోడ యొక్క రాయి 70 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు, 8 అడుగుల ఎత్తు అని తాను వ్రాసిన యెరూషలేము యొక్క చరిత్ర గ్రంథములో చెప్పాడు. నెహెమ్యా ఇంత పెద్ద రాళ్ళను తొలిపించి మందిరమును 52 దినములలో కట్టుట తలంచగా నెహెమ్యాకు మందిరము విషయమై ఉన్న ఆసక్తిని మనము గమనించ తగినది. అటువలెనే ఈ దినములలో ఆత్మ సంబంధమైన సంఘము అను మందిరము యొక్క విస్తీర్ణ పనిలో మనము ఆసక్తి కలిగియుండాలని నేర్చుకొందము.

# నేటి క్రొత్త నిబంధన కాల సంఘములు

క్రీ.పూ. 536లో మందిర నిర్మాణమునకై జెరుబ్బాబేలు యెరూషలేముకు వెళ్ళాడు. క్రీ.పూ. 457లో ఎజ్రా 1756 మంది పనివారిలో మందిర అలంకరణ కొరకై యెరూషలేముకు వెళ్ళాడు. క్రీ.పూ. 455లో నెహెమ్యా అర్తహషస్త రాజాజ్ఞతో యెరూషలేము పట్టణ ప్రాకారము నిర్మించుటకు యెరూషలేము వెళ్ళాడు. వారితో పాటు వెళ్ళిన పనివారు భూమి మీద కాలినడకన వెళ్ళాలి లేదా సముద్రము మీద పడవలో వెళ్ళాలి. వీరందరు షుమారు వేయిమైళ్ళ అనగా 1600 కిలోమీటర్లు దూరము వెళ్లారు. మందిరము విషయము వారికి కలిగిన ఆసక్తి ఎంత గొప్పదో మనము గమనించాలి.

మన మన గ్రామముల నుండి ఎంత మంది వేలకొలది మైళ్ళు వెళ్ళి సువార్త ప్రకటించు పనికి ఇష్టపూర్వకముగా అప్పగించుకున్నారు. ఆ దినములలో ప్రయాణ సాధనములు లేవు. ఈ దినములలో ప్రయాణముకై ఎన్నో సదుపాయములున్నవి. ఎంత మందిమి సువార్త ప్రకటించు పనికి వెళ్లగలుగుతున్నాము. మన జిల్లాలలో కేంద్రము నుండి గ్రామములు అన్ని 1600 కిలోమీటర్లు కాదు 160 కిలోమీటర్లులోపే వుండవచ్చును. మీరు ఇష్టపడి తీర్మానించితే మన జిల్లాలోని ప్రతి గ్రామమునకు వెళ్ళి సువార్తను ప్రకటించుచూ ఆత్మలను సంపాదించి ఆత్మీయ సంఘములను కట్టవచ్చు. మీ తీర్మానమును దేవుడు అంగీకరిస్తారు. మీకు తోడుగా ఉండి పని జరిగిస్తాడు. తీర్మానము మీదే. సంఘములు ఏర్పడిన తరువాత గాయకులు నేటి సంఘములలో పాటలు పాడు వరముగల గాయకులు (అందరూ కాదు) గుర్తించబడి పాటలు నడిపించుపనికి నియమించబడాలి. మిగిలిన వారు సమాజముతో కలిసి పాడవచ్చును. ఆలాగే లేవీయులు అనగా ఏ ఇతర పనుల మీద మనసుంచక సేవ కొరకు ప్రత్యేకించబడి నియమించబడినవారు. యెహో 13:33వ. గమనించండి. లేవీ గోత్రమునకు మోషే స్వాస్థ్యము పంచిపెట్టలేదు; ఏలయనగా ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా వారితో సెలవిచ్చినట్లు ఆయన అనగా ఆయన పనియే వారికి స్వాస్థ్యము.

నేటి సంఘములలో అలాగు దేవుని పనికై ప్రత్యేకించబడిన సువార్తికులు అను పనివారున్నారు. మిగిలిన సహోదరుల మధ్య నుండి దేవుని చేత నియమించబడిన కాపరులు అనబడిన పెద్దలు ఉపదేశకులు ఉన్నారు. ఎఫె 4:13వ. చూడండి.

ఎఫె 4:13వ. పరిశుద్ధులు సంపూర్ణులగునట్లు క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకును, పరిచర్య ధర్మము జరుగుటకు కొందరిని సువార్తికులనుగాను (ఒకే నాయకుడు కాదు, కొందరు కాని సహోదరులు అందరు కాదు). కొందరిని కాపరులనుగాను (ఒకే కాపరి) పాస్టర్ కాదు, కొందరిని ఉపదేశకులనుగాను వరము కలిగిన వారినే పరిశుద్ధాత్ముడు నియమించును. నియమించబడు విధము ఆపో. 13:1-3 వచనములను చూతుము. ఆపో. 13:1-3వ. 1వ. అంతియొకయలోనున్న సంఘములో బర్నబా, నీగెరనబడిన సుమెయోను, కురేనీయుడైన లూకియ చతుర్థాధిపతియైన హేరోదుతో కూడా పెంచబడిన మన యేను, సౌలు అను ప్రవక్తలు, బోధకులు ఉండిరి. 2వ. వారు ప్రభువును సేవించుచు ఉపవాసము చేయుచుండగా పరిశుద్ధాత్మ నేను బర్నబాను సౌలును పిలిచిన పనికొరకు వారిని నాకు ప్రత్యేకపరచుడని వారితో చెప్పెను. 3వ. అంతట వారు ఉపవాసముండి ప్రార్థనచేసి వారి మీద చేతులుంచి వారిని పంపిరి. ఈ ఏర్పాటు విషయములో సంఘమందు బోధచేయు బోధకులు పాత్ర కలిగియుందురు.

ఆపో. 14:21-23వ. వారు ఆ పట్టణములో సువార్త ప్రకటించి అనేకులను శిష్యులనుగా చేసిన తరువాత, ప్రతి సంఘములో వారికి పెద్దలను ఏర్పరచి, ఉపవాసముండి, ప్రార్థన చేసి, వారు నమ్మిన ప్రభువునకు వారిని అప్పగించిరి. సువార్త ప్రకటించిన సువార్తికులు, సంఘమందు బోధచేయు బోధకులు పెద్దలను ఏర్పరచుటలో పాత్ర కలిగియుందురు. ఈలాగు నియమించబడిన సువార్తికులకు, కాపరులు అనబడిన పెద్దలు, పాస్టర్లకు సంఘములోని సహోదరులందరు ఆ నియమమునకు లోబడి సంఘ కార్యక్రమములు జరిగించుటలో తోడ్పడాలి.

ఎజ్రా 2:68-69వ. కుటుంబ ప్రధానులు కొందరు యెరూషలేములోనుండు యెహోవా మందిరానికి వచ్చి దేవుని మందిరమును దాని స్థలములో నిలుపులకు కానుకలను స్వేచ్ఛార్పణములుగా అర్పించిరి. పని నెరవేర్చుటకు తమ శక్తి కొలది ఖజానాకు పదునారువేల మూడువందల తులముల బంగారమును రెండు లక్షల యేబదివేల తులముల వెండిని ఇచ్చిరి. వెండి విమోచనకు బంగారు దైవత్వమునకు సాదృశ్యములు.

## మాసిదోనియా సంఘములు ప్రభువు పరిచర్యకై ఇచ్చుట గమనించండి.

2 కొరిం 8:1-5వ. సహోదరులారా, మాసిదోనియ సంఘములకు అనుగ్రహింప బడియున్న దేవుని కృపను గూర్చి మీకు తెలియజేయుచున్నాము. 2వ. ఏలాగనగా, వారు శ్రమ వలన పరీక్షింపబడగా, బహుగా సంతోషించిరి. మరియు వారు నిరుపేదలైనను వారి దాతృత్వము బహుగా విస్తరించెను. 3వ. ఈ కృప విషయములోను, పరిశుద్ధుల కొరకైన పరిచర్యలో పాలుపొందు విషయములో, మన:పూర్వకముగా మమ్మును వేడుకొనుచు, 4వ వారు తమ సామర్థ్యము కొలదియేగాక సామర్థ్యము కంటె ఎక్కువగాను తమంతట తామే యిచ్చిరని మీకు సాక్ష్యమిచ్చుచున్నాను. 5వ. ఇదియుగాక మొదట ప్రభువునకు, దేవుని చిత్తమువలన మాకు, తమ్మును తామే అప్పగించుకొనిరి. యింతగా చేయుదురని మేమనుకొనలేదు.

ఎజ్రా 2:69లో యాజకుల కొరకు నూరు వస్త్రములను ఇచ్చిరని చెప్పబడినది. ఆనాటి యాజకులు ప్రత్యేకించబడిన లేవీయులలోని వారే. కనుక ఈ దినములలో మనమధ్య ప్రత్యేకించబడిన సువార్తికులకు వస్త్రములు, సేవకులకు వారి జీవనమునకు అవసరమైన వాటిని ఇచ్చుటకు 1 కొరిం 9:13-14వ. ప్రకారము మనము మనసు కలిగియుందము.

1 కొరిం 9:13-14వ. ఆలయ కృత్యములు జరిగించువారు ఆలయమువలన జీవనము చేయుచున్నారని, బలిపీఠమునొద్ద కనిపెట్టుకొనియుండువారు బలిపీఠముతో పాలివారైయున్నారని మీరెరుగరా ? ఆలాగున సువార్త ప్రకటించువారు సువార్త వలన జీవింపవలెనని ప్రభువు నియమించియున్నాడు.

నెహె 13:12-13వ. ఆలాగే లేవీయులకు ఆహారమును పంచిపెట్టు పనిని నెహెమ్యా ఏర్పాటు చేశాడు.

# ఎజ్రా – నెహెమ్యా గ్రంథముల పరిచయము

## ఎజ్రా గ్రంథ విభజన 6+4=10 అధ్యాయాలు

**గ్రంథకర్త : ఎజ్రా** **కాలం : 536-547=80 సం॥లు**

ఎజ్రా అనగా సహాయం అని అర్థం. రోమా 8:26 ప్రకారం పరిశుద్ధాత్మకు గుర్తు.

1-6అ. మందిరము కట్టుట. 7-10 అ. అలంకరణ (దిద్దుబాటు)

**1-2అ. యెరూషలేమునకు ప్రయాణం**

**1అ. పనికి సిద్ధపాటు :-** క్రీ.పూ. 536లో మందిరం కట్టవలెనని పారసీకుడగు కోరెషుకు దేవుడు ఆజ్ఞాపించగా ఉపకరణములను తీసుకొని యెహోషువ, జెరుబ్బాబెలుల నాయకత్వంలో 49,897 మంది ప్రజలు బయలుదేరుట. (11వ)

**2అ. పనికి ప్రయాణము :-** యెరూషలేమునకు వెళ్ళినవారి వివరాలు, తెచ్చిన సామాగ్రి వివరాలు (64వ.)

**3అ. పని ప్రారంభం :-** బయలుదేరి వచ్చిన 20 సం॥లపై గల లేవీయులందరిని పనికి నియమించి దేవుణ్ణి స్తుతించుచూ మందిరం పునాదివేయుట. (8వ)

**4-5వ. పనికి ఆటంకములు :-**

**4అ. ఆటంకముల మధ్య పని నిలిచిపోవుట :-** విరోధులైన వారు అర్తహషస్త రాజుకు అబద్ధములు చెప్పి పని ఆగిపోవునట్లు చేయగా క్రీ.పూ. 535-520 వరకు 15 సం॥లు పని ఆగిపోయెను (24వ.)

**5అ. ఆటంకముల మధ్య పని మరలా ప్రారంభం :-** క్రీ.పూ.520లో హగ్గయి, జెకర్యాల పురికొల్పుతో 15 సం॥లు ఆగిన మందిరపుపని ప్రారంభం (2వ.)

**6అ. పని సమాప్తము :-** 6:15 వచనం ప్రకారం దర్యావేషు రాజు ఏలుబడియందు 6వ సం॥ అనగా క్రీ.పూ. 515 సం॥లో మందిరపు పని సమాప్తి చేయబడెను. ప్రతిష్ఠింపబడి పస్కా పండుగ పులియని రొట్టెల పండుగలు జరుపుకొనిరి.

**7-8అ. పని, పనివారలు - అలంకరణ :-**

**7అ. పనివారల నియామకము :-** ధర్మశాస్త్రమందు ప్రవీణత కలిగి పరిశోధించిన ఎజ్రాను దేవుడు నియమించి బబులోను నుండి అర్తహషస్త కాలంలో యెరూషలేమునకు

పంపాడు. క్రీ.పూ. 457లో ఎజ్రా 1756 మంది పనివారలతో బయలుదేరి వచ్చి యాజకులను లేవీయులను ఉపదేశకులను సహాయకులైన నెతీనీయులను నియమించి మందిరం అలంకరించాడు. మందిరం కార్యక్రమ విధులను కూడా నియమించాడు. (27వ.)

**8అ. పనివారిని ప్రత్యేకించి పరికరములు అప్పగించుట :-** యాజకులను మందిరం పరికరములు తీసుకుని యెరూషలేమునకు వచ్చి మందిరమునందుంచుట. (36వ.)

**9అ. ప్రార్థన :-** ఎజ్రా సమాజము యొక్క పవిత్రత కొరకై ప్రార్థించెను. (15వ)

**10 అ. పవిత్రత దిద్దుబాటు :-** యూదావారు, యాజకులు, లేవీయులు, గాయకులు, ద్వారపాలకులు తమ పాపము ఒప్పుకొనుచూ, జీవితములు దిద్దుకొనుట. (17వ)

# నెహెమ్యా గ్రంథ విభజన 6+7=13 అధ్యాయాలు

**గ్రంథకర్త : నెహెమ్యా** **కాలము : 445-425=20 సం॥లు**

నెహెమ్యా అనగా ఆదరణ అని అర్థం. యోహాను 14:28 ప్రకారము పరిశుద్ధాత్మకు గుర్తు.

1-6అ. యెరూషలేము ప్రాకారము కట్టుట 7-13అ. అలంకరణ (దిద్దుబాటు)

**1-2అ. యెరూషలేమునకు ప్రయాణం**

**1అ. పనికి సిద్ధపాటు :-** పడిపోయిన ప్రాకారం గూర్చి వార్త విని ప్రార్థించి రాజుతో మనవి చేసి సిద్ధపడుట (4వ)

**2అ. పనికి ప్రయాణము :-** రాజు యొక్క సెలవుతో యెరూషలేమునకు సామాగ్రితో ప్రయాణం. (9వ)

**3అ. పని ప్రారంభం :-** క్రీ.పూ. 445లో పట్టణ ప్రాకారాలను కట్టుటకు ప్రారంభించుట (14)

**4-5అ. పనికి ఆటంకాలు :-**

**4అ. ఆటంకములు మధ్య పని కొనసాగుట :-** శత్రువులైన సన్బల్లటు, టోబియా, గేషెము ద్వారా ఆటంకములు కలిగినను పని కొనసాగెను (6వ.)

**5అ. స్వజనుల వలన ఆటంకాలు :-** ఆటంకాలు కలిగినను మందిరం ప్రాకారపు పని కొనసాగెను (16వ)

**6 అ.పని సమాప్తము :-**

6:15 వచనం ప్రకారం 52 దినాలలో పని సమాప్తమాయెను.

**7-8అ. పనివారలు - అలంకరణ :-**

**7అ. పనివారల నియామకము :-** లేవీయులను, గాయకులను, పాలకులను నియమించి కోటకు అధిపతి అయిన హనానీ అధికారము క్రింద ఉంచెను. (1వ)

**8అ. పని వివరము :-** ధర్మశాస్త్ర గ్రంథమును ఎజ్రా ఉ॥ నుండి మ॥ వరకు 13 మంది పనివారలతో చదివి వినిపించగా 13 మంది లేవీయులు తాత్పర్యము చెప్పిరి. యెహోషువ దినాలు మొదలుకొని ఎన్నడు జరుగనట్లు 7 దినములు పర్ణశాలల పండుగ జరిగెను (17వ)

**9అ. ప్రార్థన :-** నెహెమ్యా, జనులు, యాజకులతో కలసి ఉపవాసం ఉండి గోనెపట్ట కట్టుకొని పాపం ఒప్పుకొనుచూ దేవుని కార్యములు తలపోసుకొనుట.

**10-13 అ. పవిత్రత - దిద్దుబాటు :-** 10అ. దేవుని మందిర కార్యక్రమ విషయాలలో యాజకులు, లేవీయులు, ద్వారపాలకులు, గాయకులు అందరు కలసి స్థిరమైన నిబంధన చేసి వ్రాసుకొని ముద్రవేయుట.

11అ. అధికారులు, పనివారలు యెరూషలేములోనే నివసించుటకై తీర్మాణము చేసికొనిరి.

12అ. ప్రాకారములను క్రొత్త గీతములతో ప్రతిష్ఠించుకొనుట (47వ.)

13అ. క్రీ.పూ. 432లో నెహెమ్యా - అర్తహషస్త రాజును దర్శించి యెరూషలేముకు తిరిగివచ్చి మందిరంలోని యాజకుల, లేవీయుల పోషణ విషయమై దిద్దుబాటును క్రీ.పూ. 424 వరకు జరిగించెను. (13వ)

# నెహెమ్యా 1వ అధ్యాయము (3+4+4=11వ.)

## అంశము :- పని ప్రారంభము.

**1-3వ. యెరూషలేము యొక్క స్థితి :-** 1వ. హకల్యా కుమారుడైన నెహెమ్యా యొక్క చర్యలు. నెహెమ్యా పారశీకుడగు అర్తహషస్త రాజుకు గిన్నె అందించువాడైయుండెను. అర్తహషస్త రాజు పాలనలో క్రీ.పూ. 458లో ఇరువదియవ సంవత్సరములో కిస్లేవు మాసమున నెహెమ్యా షూషను కోటలో ఉండగా నెహెమ్యా సహోదరుడగు హనానీ, యూదులలో కొందరు వచ్చిరి.

2 రాజు 25:8-9వ. బబులోను రాజైన నెబుకద్నెజరు ఏలుబడిలో పందొమ్మిదవ సంవత్సరమందు అయిదవనెల యేడవ దినమున రాజదేహ సంరక్షకుల అధిపతియు బబులోను రాజు సేవకుడగు నెబూజరదాను యెరూషలేమునకు వచ్చి యెహోవా మందిరమును రాజనగరును యెరూషలేమునందున్న యిండ్లన్నిటిని గొప్పవారి యిండ్లన్నిటిని అగ్నిచేత కాల్పించెను. రాజదేహ సంరక్షకుల అధిపతి యెరూషలేము చుట్టునున్న ప్రాకారము పడగొట్టెను. పట్టణమందు మిగిలినవారిని, బబులోనురాజు పక్షము చేరిన వారిని, సామాన్య జనులలో శేషించినవారిని రాజదేహ సంరక్షకుల అధిపతియైన నెబూజరదాను చెరగొనిపోయెను.

2-3వ. యెరూషలేము దేవాలయమును గూర్చి, దాని పట్టణమగు యెరూషలేమును గూర్చి, నెబుకద్నెజరు రాజుచే చెరపట్టబడి కోరెషు రాజుచే క్రీ.పూ. 536లో చెరనుండి విడిపించబడిన శేషమగు యూదులను గూర్చి, నెహెమ్యా వారినడుగగా వారు చెర పట్టబడినవారిలో శేషించినవారు ఆ దేశములో బహుగా శ్రమను నిందను పొందుచున్నారు. మరియు యెరూషలేము యొక్క ప్రాకారము పడద్రోయబడినది; దాని గుమ్మములు నెబుకద్నెజరు రాజుచే అగ్ని చేత కాల్చబడినప్పటినుండి అలాగే ఉన్నవని నెహెమ్యాతో చెప్పిరి.

**4-7వ. పాపమును ఒప్పుకొనుచు ప్రార్థన చేయుట :-** 4వ. ఈ మాటలు వినినప్పుడు నెహెమ్యా కూర్చుండి యేడ్చి, కొన్ని దినములు దు:ఖముతో ఉపవాసముండి, ఆకాశమందలి దేవుని యెదుట విజ్ఞాపనచేసెను. ఎజ్రా 9:3లో ఎజ్రా కూడా కోరెషు రాజుచే చెరనుండి విడిపించబడిన శేషమగు యూదుల శ్రమను గూర్చిన సంగతి విని

తన పై వస్త్రమును దుప్పటిని చింపుకొని, తల వెండ్రుకలను గడ్డపు వెండ్రుకలను పెరికివేసికొని విభ్రాంతిపడి కూర్చుండి ప్రార్థించాడు. ఎజ్రా, నెహెమ్యాలు ఇద్దరు గొప్ప ప్రార్థనాపరులు.

5వ. ఎట్లనగా ఆకాశమందున్న దేవా యెహెూవా, భయంకరుడవైన గొప్ప దేవా, నిన్ను ప్రేమించి నీ ఆజ్ఞలను అనుసరించి నడుచువారిని కటాక్షించి వారితో నిబంధనను స్థిరపరచువాడా, 6వ. నీ చెవియొగ్గి నీ నేత్రములు తెరచి నీ సన్నిధిని దివారాత్రము నీ దాసులైన ఇశ్రాయేలీయుల పక్షముగా నేను చేయు ప్రార్థన అంగీకరించుము. మొదటిగా ఆకాశమందున్న దేవుడు అనగా పరలోకమందుండి సమస్తముపై అధికారము కలవాడు. మీరు తోలివేయబడినను అక్కడ నుండి సహా మిమ్మును కూర్చి, నా నామము ఉంచుటకు నేను ఏర్పరచుకొనిన స్థలమునకు మిమ్మును రప్పించెదనని దేవుడు సెలవిచ్చిన సంగతిని దేవునికి జ్ఞాపకము చేయుచున్నాడు.

**8-11వ. దేవుని వాక్యమును జ్ఞాపకము చేసికొనుట (8-9) - ప్రార్థన చేయుట (10-11) :-** 8వ. నీ సేవకుడైన మోషేతో నీవు సెలవిచ్చిన మాటను జ్ఞాపకము తెచ్చుకొనుము; అదేదనగా మీరు అపరాధము చేసిన యెడల జనులలోనికి మిమ్మును చెరగొట్టుదును. 9వ. అయితే మీరు నా వైపు తిరిగి నా ఆజ్ఞలను అనుసరించి నడిచిన యెడల, భూదిగంతముల వరకు మీరు తోలివేయబడినను అక్కడ నుండి సహా మిమ్మును కూర్చి, నా నామము ఉంచుటకు నేను ఏర్పరచుకొనిన స్థలమునకు మిమ్మును రప్పించెదనని దేవుడు సెలవిచ్చిన సంగతిని దేవునికి జ్ఞాపకము చేయుచున్నాడు.

**10-11వ. ప్రార్థన చేయుట :-** చిత్తగించుము. నీవు నీ మహా ప్రభావమును చూపి, నీ బాహుబలముచేత విడిపించిన నీ దాసులగు నీ జనులు వీరే. యెహోవా చెవియొగ్గి నీ దాసుడనైన నా మొఱ్ఱ నీ నామమును భయభక్తులతో ఘనపరచుటయందు ఆనందించు నీ దాసుల మొఱ్ఱ ఆలకించి, ఈ దినమందు నీ దాసుని ఆలోచన సఫలపరచి, రాజగు అర్తహషస్త తనయందు దయ చూపునట్లు అనుగ్రహించుమని నిన్ను బతిమాలు కొనుచున్నాను అని ప్రార్థించాడు.

# నెహెమ్యా 2వ అధ్యాయము (3+3+3+3+4+4=20వ.)

**అంశము : 1-9వ. ప్రయాణము కొరకు రాజుగారి సెలవు.**

**10-20వ. హేళనల మధ్య పనికి పూనుకొనుట.**

**1-3వ. యెరూషలేము పట్టణ గుమ్మములు పాడైయుండగా నెహెమ్యా విచారముగా నున్నాడని రాజు గుర్తించుట :-** 1వ. అటు తరువాత అర్తహషస్త రాజు ఏలుబడి కాలమున ఇరువదియవ సంవత్సరములో నీసాను మాసమందు రాజు ద్రాక్షారసము త్రాగవలెనని చూచుచుండగా నెహెమ్యా ద్రాక్షారసము తీసికొని రాజునకు అందించెను. అంతకు పూర్వము నెహెమ్యా ఎన్నడును రాజు యెదుట విచారముగా ఉండలేదు. 2-3వ. కాగా రాజు నీకు వ్యాధిలేదు గదా, నీ ముఖము హృదయ దు:ఖము చేతనే విచారము కలిగినదని నాతో అనగా నెహెమ్యా మిగుల భయపడి రాజు చిరంజీవియగును గాక. నా పితరుల సమాధులుండు పట్టణము పాడైపోయి, దాని గుమ్మములును అగ్నిచేత కాల్చబడి యుండగా నాకు దు:ఖ ముఖము లేకపోవునా అని రాజుతో అనెను.

**4-6వ. ప్రార్థించి యెరూషలేము వెళ్ళుటకు రాజు సెలవుపొందుట :-**

4వ. అప్పుడు రాజు ఏమి కావలసి నీవు మనవి చేయుచున్నావని నెహెమ్యాను అడుగగా, నెహెమ్యా ఆకాశమందలి దేవునికి ప్రార్థనచేసి 5వ. రాజుతో నెహెమ్యా నీ సముఖమందు నేను దయపొందిన యెడల, నా పితరుల సమాధులుండు పట్టణమును తిరిగి కట్టునట్లుగా నన్ను యూదా దేశమునకు పంపుడని వేడుకొనుచున్నానని నెహెమ్యా మనవి చేసెను. 6వ. అందుకు రాణి రాజుయొద్ద కూర్చునియుండగానీ ప్రయాణము ఎన్ని దినములు పట్టును ? నీవు ఎప్పుడు తిరిగి వచ్చెదనని అడిగెను. నెహెమ్యా ఇంత కాలమని చెప్పినప్పుడు రాజు నెహెమ్యా పంపుటకు మనసు గలవాడాయెను.

**7-9వ. రాజు నడిగి తాకీదులు తీసికొని నది అవతల అధికారులకు ఇచ్చుట :-**

ఇదియుగాక రాజుతో నెహెమ్యా రాజునకనుకూలమైతే తాను యూదా దేశమునకు చేరువరకు నదిని దాటించునట్లుగా నదియవతలనున్న అధికారులకు తాకీదులు, పట్టణ ప్రాకారమునకు, నేను ప్రవేశింపబోవు ఇంటికిని, మందిరము సంబంధించిన కోటగుమ్మములకు, దూలములు మ్రానులు ఇచ్చునట్లుగా రాజుగారి అడవులను కాయు ఆసాపునకు ఒక తాకీదును ఇయ్యుడని అడిగెను. ఆలాగు నెహెమ్యా మనవి ఆలకించెను.

తరువాత నెహెమ్యా నది యవతలనున్న అధికారులకు రాజుయొక్క తాకీదులను అప్పగించాడు. రాజు తనతో కూడ సేనాధిపతులను గుఱ్ఱపు రౌతులను పంపించాడు.

**10-12వ. ప్రాకారమును చూచుటకై ఒంటరిగా వెళ్ళుట :-** 10వ. హోరోనీయుడైన సన్బల్లటును అరబీయుడైన గెషెమును అమ్మోనీయుడైన టోబీయా అను దాసుడును ఇశ్రాయేలీయులకు క్షేమము కలుగజేయు ఒకడు వచ్చెనని విని బహుగా దు:ఖపడిరి. 11వ. అంతట నేను యెరూషలేమునకు వచ్చి మూడు దినములు అక్కడినేయుండి 12వ. రాత్రియందు నేనును నాతోకూడ నున్న కొందరును లేచితిమి. యెరూషలేమును గూర్చి దేవుడు తన హృదయమందు పుట్టించిన ఆలోచనను నెహెమ్యా ఎవరితోను చెప్పలేదు. నెహెమ్యా ఎక్కియున్న పశువుతప్ప మరి యే పశువును తనయొద్ద లేదు.

**13-16వ. అగ్నిచేత కాల్చబడిన గుమ్మములు చూచి తిరిగివచ్చుట :-**

13వ. నెహెమ్యా రాత్రికాలమందు లోయ ద్వారముగుండ భుజంగపు బావి యెదుటికిని పెంట ద్వారము దగ్గరకుపోయి, పడద్రోయబడిన యెరూషలేము యొక్క ప్రాకారము చూడగా దాని గుమ్మములు అగ్నిచేత కాల్చబడియుండెను. 14వ. తరువాత నెహెమ్యా బుగ్గ గుమ్మమునకు వచ్చి రాజు కోనేటికిని వెళ్లగా, నెహెమ్యా ఎక్కియున్న పశువు పోవుటకు ఎడము లేకపోయెను.

15వ. నెహెమ్యా రాత్రి మడుగు దగ్గరనుండి పోయి ప్రాకారమును చూచిన మీదట వెనుకకు మరలి లోయ గుమ్మములోబడి తిరిగివచ్చెను.

16వ. అయితే నెహెమ్యా ఎచ్చటికి వెళ్లినది యేమి చేసినది అధికారులకు, యూదులకు, యాజకులకు, యజమానులకు, పనిచేయు ఇతరమైనవారలకు నెహెమ్యా ఆ సంగతి చెప్పియుండలేదు.

**17-20వ. శత్రువుల హేళనల మధ్య విశ్వాసముతో పనికి పూనుకొనుట :-** 17వ. నెహెమ్యా యూదులతో మనకు కలిగిన శ్రమ మీకు తెలిసియున్నది. యెరూషలేము ఎట్లు పాడైపోయెనో దాని గుమ్మములు అగ్నిచేత ఎట్లు కాల్చబడెనో మీరు చూచియున్నారు. మనకు ఇకమీదట నింద రాకుండా యెరూషలేము యొక్క ప్రాకారమును మరల కట్టుదము రండి. 18వ. ఇదియుగాక నాకు సహాయము చేయు దేవుని కరుణాహస్తమును గూర్చియు, రాజు సెలవిచ్చిన మాటలన్నియు నెహెమ్యా వారితో చెప్పెను. అందుకు వారు మనము కట్టుటకు పూనుకొందము రండని చెప్పి యీ మంచికార్యము చేయుటకై బలము

తెచ్చుకొనిరి. 19వ. అయితే శత్రువులగు హోరోనీయుడైన సన్బల్లటును, అమ్మోనీయుడైన దాసుడగు టోబీయా అనువాడును, అరబీయుడైన గెషెమును ఆ మాట వినినప్పుడు హేళనచేసి పనిని తృణీకరించి మీరు చేయు పనియేమిటి ? రాజుమీద తిరుగుబాటు చేయుదురా అని అబద్ధము చెప్పిరి. 1) హోరోనీయుడైన సన్బల్లటు (సాతానుకు గురుతు) = రహస్యమైన ముల్లు. 2) అమ్మోనీయుడైన (లోతు సంతానము). టోబీయా లోకమునకు గురుతు = దయాళుడు. 3) అరబీయుడైన (అబ్రహాము సంతానము), గెషెము శరీరమునకు గురుతు = గాలి, వాన. సాతాను, శరీరము, లోకము. ఈ ముగ్గురు మనలను వశపరచుకొని దేవునికి వ్యతిరేకముగా మనము ప్రవర్తించుటకు ప్రేరేపించుదురు. మనము నెహెమ్యావలె జాగ్రత్తగా ఉండాలి. 20వ. అందుకు ఆకాశమందు నివాసియైన దేవుడు తానే మా యత్నమును సఫలము చేయును గనుక ఆయన దాసులమైన మేము కట్టుటకు పూనుకొనుచున్నాము, యెరూషలేమునందు మీకు భాగమైనను స్వతంత్రమైనను జ్ఞాపక సూచనయైనను లేదని వారికి నెహెమ్యా ప్రత్యుత్తరమిచ్చెను.

# నెహెమ్యా 3వ అధ్యాయము (8+8+8+8=32వ.)

**అంశము :- మూడవ అధ్యాయములో ఎక్కువగా కనిపించు 7 పదములు గమనించండి.**

1) బాగుచేసెను = 33 పర్యాయములు. 2) ఆనుకొని = 32 పర్యాయములు 3) కట్టుట = 12 పర్యాయములు 4) కుమారుడు = 31 పర్యాయములు 5) కుమార్తెలు = 1 పర్యాయము 6) చేసెను = 20 పర్యాయములు 7) చేసిరి = 13 పర్యాయములు. 1 కొరి 3:12-15వ. ఎవడైనను ఈ పునాదిమీద బంగారము, వెండి, వెలగల రాళ్లు, కఱ్ఱ, గడ్డి, కొయ్యకాలు మొదలైన వాటితో కట్టిన యెడల, వాని వాని పని కనబడును. ఆ దినము దానిని తేటపరచును, అది అగ్నిచేత బయలుపరచబడును. మరియు వాని వాని పనియెట్టిదో దానిని అగ్నియే పరీక్షించును. పునాది మీద ఒకడు కట్టిన పని నిలిచినయెడల వాడు జీతము పుచ్చుకొనును. ఒకని పని కాల్చివేయబడిన యెడల వానికి నష్టము కలుగును; అతడు తన మట్టుకు రక్షింపబడును గాని అగ్నిలో నుండి తప్పించుకొన్నట్టు రక్షింపబడును. 1 కొరిం 3:17వ. ఎవడైనను దేవుని ఆలయమును పాడుచేసిన యెడల దేవుడు వానిని పాడుచేయును. దేవుని ఆలయము పరిశుద్ధమైయున్నది; మీరు ఆ ఆలయమైయున్నారు.

**1) గొఱ్ఱెల గుమ్మము (నెహె 3:1-2వ.) :-** 1వ. ప్రధాన యాజకుడైన ఎల్యాషీబు అతని సహోదరులైన యాజకులు లేచి గొఱ్ఱెల గుమ్మము కట్టి ప్రతిష్ఠించి తలుపులు నిలిపిరి. హమ్మేయా గోపురము వరకును హనన్యేలు గోపురము వరకును ప్రాకారము కట్టి ప్రతిష్ఠించిరి. 3:32వ. మరియు మూలకు గొఱ్ఱెల గుమ్మమునకు మధ్యను బంగారపు పనివారును వర్తకులు బాగుచేసిరి. బంగారపు పనివారగు వర్తకులు బహుశా ధనికులైయుందురు. ధనికులైనవారు తమ డబ్బుతో పని చేయించవచ్చు. అలాగుకాక తాము కూడా పనిచేయుట మనందరికి మాదిరి. గొఱ్ఱెలు యెరూషలేము పట్టణములో ప్రవేశించు గుమ్మము. యేసు లోక పాపమును మోసికొనుపోవు దేవుని గొఱ్ఱెపిల్ల కనుక ఈ లోకము లోనికి యెరూషలేము పట్టణములోనికి గొఱ్ఱెవలె వచ్చి క్రీ.శ. 30లో వధించబడిన యేసును చూపుచున్నది. మొదటి వచనమందు చివరి వచనమందు ఈ గుమ్మము చెప్పబడినందున ఈ గుమ్మము మన పాపముల నిమిత్తము సిలువవేయబడి

మరణించి తిరిగి లేచిన యేసును మనకు జ్ఞాపకము చేయుచున్నది. యెష 53:6-8వ. మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడు తనకిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మనందరి దోషము అతని మీద మోపెను. అతడు దౌర్జన్యము నొందెను. బాధింపబడినను అతడు నోరు తెరవలేదు. వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు బొచ్చు కత్తిరించు వాని యెదుట గొఱ్ఱె మౌనముగా నుండునట్లు అతడు నోరుతెరువలేదు. అన్యాయపు తీర్పు నొందినవాడై అతడు కొనిపోబడెను. అతడు జనుల అతిక్రమమును బట్టి మొత్తబడెను. మన పాపముల నిమిత్తము సిలువ వేయబడి మరణించి తిరిగిలేచెను. ఎఫె 2:1-4వ. ప్రకారము మనలను రక్షించాడు. మీ పాపములచేతను, అపరాధముల చేతను మీరు చచ్చినవారై యుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రదికించెను. మనమందరమును శరీరముయొక్కయు, మనస్సు యొక్కయు కోరికలను నెరవేర్చుకొనుచు, మన శరీరాశలను అనుసరించి ప్రవర్తించుచు, కడమ వారివలెనే స్వభావసిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమైయుంటిమి. అయినను దేవుడు కరుణా సంపన్నుడైయుండి, మనము మన అపరాధములచేత చచ్చినవారమై యుండినప్పుడు సయితము మనయెడల చూపిన తన మహా ప్రేమచేత మనలను క్రీస్తుతో బ్రతికించి పాప శిక్షనుండి తప్పించాడు. కృపచేతనే మనము రక్షింపబడియున్నాము.

ప్రధాన యాజకుడైన ఎల్యాషీబు అతని సహోదరులైన యాజకులులేచి గొఱ్ఱెల గుమ్మము కట్టి తలుపులు నిలిపి ప్రతిష్ఠించిరి. హమ్మేయా గోపురము వరకును హనన్యేలు గోపురము వరకును ప్రాకారము కట్టి ప్రతిష్ఠించిరి. ఇంతవరకు తలుపులు లేనందున గొఱ్రెలను చంపు తోడేళ్లు వచ్చుచుండెను కాబోలు. ప్రధాన యాజకుడైన ఎల్యాషీబు గుర్తించి సహోదరులను కలుపుకొని వారితో కలిసి పనిచేయుట మనందరికి ముఖ్యముగా నేటి సంఘములలో కాపరులను మాదిరిగా నున్నది. నేటి క్రొత్త నిబంధన కాల సంఘములలో కాపరులగువారు ఈ రీతిగా పనిచేయాలి.

**2) మత్స్యపు గుమ్మము. (నెహె 3:3వ.) :-** మత్స్యపు గుమ్మమును హస్సెనాయా వంశస్థులు కట్టిరి. చేపలను పట్టిన జాలరులు ఈ ద్వారము గుండా పట్టణములో ప్రవేశించుదురు. వరుసలో ఇది రెండవ ద్వారము. కనుక చేపలను పట్టుట యొక్క ప్రాముఖ్యతను ఇక్కడ చూతుము. మత్త 4-19వ. ఆయన నా వెంబడిరండి, నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులనుగా చేతునని వారితో చెప్పెను.

రక్షించబడిన ప్రతి వ్యక్తి అలాగు చెప్పి వారి చిన్న సాక్ష్యముద్వారా ఆత్మలను సంపాదించిన తరువాత ప్రారంభ దినములలో ఉన్న ఆసక్తి క్రమముగా తగ్గిపోవుట జరుగును. ఆలాగుకాక ఆత్మల సంపాదనలో ఆసక్తులుగా ఉండాలని నేర్చుకొనుచున్నాము.

యోహా 19:1-9వ. గొఱ్ఱెల దొడ్డిలో ద్వారమున ప్రవేశింపక వేరొక మార్గమున ఎక్కువాడు దొంగయు దోచుకొనువాడునైయున్నాడు. 2వ. ద్వారమున ప్రవేశించువాడు గొఱ్ఱెల కాపరి. అతనికి ద్వారపాలకుడు తలుపు తీయును. గొఱ్ఱెలు అతని స్వరము వినును. అతడు తన సొంత గొఱ్ఱెలను పేరుపెట్టి పిలిచి వాటిని వెలుపలికి నడిపించును. 4వ. మరియు అతడు తన సొంత గొఱ్ఱెలనన్నిటిని వెలుపలికి నడిపించునపుడెల్ల వాటికి ముందుగా నడుచును; గొఱ్ఱెలు అతని స్వరమెరుగును గనుక అవి అతని వెంబడించును. 5వ. అన్యుల స్వరము అవి యెరుగవు గనుక అన్యుని ఎంతమాత్రమును వెంబడింపక వానియొద్దనుండి పారిపోవునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని వారితో అనెను. 6వ. ఈ సాదృశ్యము యేసు వారితో చెప్పెను గాని ఆయన తమతో చెప్పిన సంగతులెట్టివో వారు గ్రహించుకొనలేదు. 7వ. యేసు వారితో ఇట్లనెను. 8వ. గొఱ్ఱెలు పోవు ద్వారమును నేనే; నాకు ముందు వచ్చినవారందరు దొంగలును దోచుకొనువారునైయున్నారు; గొఱ్ఱెలు వారి స్వరము వినలేదు. 9వ. నేనే ద్వారమును నా ద్వారా ఎవడైన లోపల ప్రవేశించిన యెడల వారు రక్షింపబడినవారై, లోపలికి పోవుచు బయటికి వచ్చుచు మేతమేయుచు నుండును.

**3. పాత గుమ్మము (నెహె 3:6-8వ.) :-** పాత గుమ్మమును బాగుచేయువారు ఎవరనగా పానెయ కుమారుడైన యెహెూ యూదాయును... యిర్మీ 6:16వ. యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. మార్గములలో నిలిచి చూడుడి. పురాతన మార్గములను గూర్చి విచారించుడి, మేలు కలుగు మార్గమేది అని యడిగి అందులో నడుచుకొనుడి, అప్పుడు మీకు నెమ్మది కలుగును. అయితే వారు మేము అందులో నడుచుకొనమని చెప్పుచున్నారు. విశ్వాసి తన జీవితములో ముందుకు వెళ్లునపుడు అనేక కొత్త విషయములు తన ముందుకు వచ్చును. కనుక పురాతన మార్గమును అనగా పాత మార్గమును విడిచిపెట్టకూడదు.

హెబ్రీ 13:8వ. ప్రకారము యేసుక్రీస్తు నిన్న, నేడు, ఒక్కటే రీతిగా ఉన్నాడు; అవును యుగయుగములకు ఒక్కటే రీతిగా ఉండును, కనుక ముందు నేర్చుకున్న సంగతులకు మార్పు ఉండదు. పాత గుమ్మము ముందు నేర్చుకున్న పాత విషయములను విడువకూడదని నేర్పుచున్నది.

**ప్రవచనము :-** సంఘ చరిత్రలో క్రీ.శ. 100-300 కాలమున అవిశ్వాసులనుండి విశ్వాస సత్యములను కాపాడుటకై అనేక పోరాటములు జరిగినవి. కాని క్రీ.శ. 312 కన్స్టంటైన్ చక్రవర్తి క్రైస్తవుడయ్యాక ఆయన ద్వారా, తన తల్లి ద్వారా అనేక అన్య ఆచారములు సంఘములో మరలా ప్రవేశించినవి. వాటినుండి సంఘము కాపాడబడుటకు బహుకాలము పోరాడవలసి వచ్చినది. కనుక నేటి నూతన నిబంధన సంఘములలో అన్య ఆచారములు మరలా ప్రవేశించకుండా జాగ్రత్త పడాలి. 7-8వ. వారిని ఆనుకొని గిబియోనీయులును మిస్పావారును గిబియోనీయుడైన మెలట్యా మేరోనోతీయుడైన యాదోనును ఏటి యివతలనున్న అధికారి న్యాయపీఠముంచబడు స్థలమువరకు బాగుచేసిరి. వారిని ఆనుకొని బంగారపు పనివారి సంబంధియైన హర్షయా కుమారుడైన ఉజ్జీయేలు బాగుచేయువాడై యుండెను. అతని ఆనుకొని ఔషధ జ్ఞానియగు అనగా డాక్టర్ హనన్యా పని జరుపుచుండెను. డాక్టర్లు తమ పనికంటే దేవుని పని ముఖ్యమని క్రొత్త నిబంధనలో వైద్యుడగు లూకావలె దేవుని పనినే ఎక్కువగా ప్రేమించాలి. యెరూషలేము యొక్క వెడల్పు గోడవరకు దానిని ఉండనిచ్చిరి.

**9-16వ. లోయ గుమ్మము (13వ.) పెంట గుమ్మము (14వ.), ధార గుమ్మము (15వ.) పట్టణ అధిపతులు, వారి కుమారులు బాగుచేయుట :-** బేత్‌హక్కెరెము ప్రదేశమునకు అధిపతియైన రేకాబు కుమారుడైన మల్కీయా, మిస్పా ప్రదేశమునకు అధిపతియైన కొల్హోజె కుమారుడైన షల్లూము, బేత్సూరులో సగము భాగమునకు అధిపతియు అజ్బూకు కుమారుడునైన నెహెమ్యా బాగుచేయుట, కట్టుట గమనించండి. పట్టణ అధిపతులు, వారి కుమారులు బాగుచేయుట, కట్టుట ఎంతగానో సంతోషించతగినది. ఈ దినములలో పట్టణ అధిపతులు, వారి కుమారులు బాగుచేయుట, కట్టుటకు పూనుకొనవలెనని వారిని పురికొల్పుదురు. 13వ. లోయ ద్వారమును హానూనును జానోహ కాపురస్థులు బాగుచేసి కట్టిన తరువాత దానికి తలుపులను తాళములను గడియలను అమర్చిరి. ఇదియుగాక పెంట ద్వారము వరకుండు గోడ వెయ్యి మూరలదనుక వారుకట్టిరి. 14వ. బేత్‌హక్కెరెము ప్రదేశమునకు అధిపతియైన రేకాబు కుమారుడైన మల్కీయా పెంట గుమ్మమును బాగుచేసెను. అతడు దాని కట్టిన తరువాత దానికి తలుపులు నిలిపి తాళములను గడియలను అమర్చెను.

15వ. అటు వెనుక మిస్పా ప్రదేశమునకు అధిపతియైన కొల్హోజె కుమారుడైన షల్లూము ధార యొక్క గుమ్మమును బాగుచేసి కట్టిన తరువాత దానికి తలుపులు నిలిపి తాళములను

గడియలను అమర్చెను. ఇదియు గాక దావీదు పట్టణము నుండి క్రిందకు పోవు మెట్ల వరకు రాజు తోట యొద్ద నున్న సిలోయము మడుగు యొక్క గోడను అతడు కట్టెను. 16వ. అతని ఆనుకొని బేత్సూరులో సగము భాగమునకు అధిపతియు అజ్బూకు కుమారుడునైన నెహెమ్యా బాగుచేసెను. అతడు దావీదు సమాధులకు ఎదురుగా నున్న స్థలముల వరకును కట్టబడిన కోనేటి వరుకును పరాక్రమ శాలుల యిండ్ల స్థలము వరకును కట్టెను.

**17-24వ. కెయిలా, మిస్పా పట్టణ అధిపతులు, వారి కుమారులు, యాజకులు ఒకరిని ఒకరు ఆనుకొని బాగు చేయుట :-** 17వ. అతని ఆనుకొని లేవీయులలో బానీ కుమారుడైన రెహూము, హషబ్యా బాగుచేసెను; అతని ఆనుకొని తన భాగములో కెయిలా యొక్క సగము భాగమునకు అధిపతి బాగుచేయు వాడాయెను. 18వ. అతని ఆనుకొని వారి సహోదరులైన హేనాదాదు కుమారుడైన బవ్వై బాగుచేసెను. అతడు కెయిలాలో సగము భాగమునకు అధిపతిగా ఉండెను. 19వ. అతని ఆనుకొని మిస్పాకు అధిపతియు యెషూవకు కుమారుడునైన ఏజెరు ఆయుధముల కొట్టు మార్గమునకు ఎదురుగానున్న గోడ మలుపు ప్రక్కను మరియొక భాగమును బాగుచేసెను.

20వ. అతని ఆనుకొని ఆ గోడ మలుపునుండి ప్రధాన యాజకుడైన ఎల్యాషీబు ఇంటిద్వారము వరకు ఉన్న మరియొక భాగమును జబ్బయి కుమారుడైన బారూకు ఆసక్తితో బాగుచేసెను. 21వ. అతని ఆనుకొని ఎల్యాషీబు ఇంటి ద్వారము నుండి ఆ యింటి కొనవరకు హక్కోజునకు పుట్టిన ఊరియా కుమారుడైన మెరేమోతు బాగుచేసెను. 22వ. అతనిని ఆనుకొని యొర్దాను మైదానములో నివాసులైన యాజకులు బాగుచేయువారైరి. 23వ. వారిని ఆనుకొని తమ యింటి కెదురుగా బెన్యామీను హష్షూబు అనువారు బాగుచేసిరి; వారిని ఆనుకొని తన యింటియొద్ద హనన్యాకు పుట్టిన మయశేయా కుమారుడైన అజర్యా బాగుచేసెను. 24వ. అతని ఆనుకొని అజర్యా యిల్లు మొదలుకొని గోడ మలుపు మూలవరకును హేనాదాదు కుమారుడైన బిన్నూయి మరియొక భాగమును బాగుచేసెను.

**25-32వ. నీటి గుమ్మము (3:26వ.), గుఱ్ఱపు గుమ్మము (3:26వ.), తూర్పు గుమ్మము (3:29వ.), మిప్కాదు గుమ్మము - పరీక్ష గుమ్మము (3:31వ.) :-** 25వ. అతని ఆనుకొని గోడ మళ్లిన దిక్కున చెరసాల దగ్గర రాజు నగరులో నిలుచు మహాగోపురము

వరకు ఊజై కుమారుడైన పాలాలు బాగుచేయువాడాయెను; అతని ఆనుకొని పరోషు కుమారుడైన పెదాయా బాగుచేసెను. 26వ. ఓపెలులోనున్న నెతీనీయులు తూర్పువైపు నీటిగుమ్మము ప్రక్కను దానికి సంబంధించిన గోపురము దగ్గరను బాగుచేసిరి. 27వ. వారిని ఆనుకొని ఓపెలు గోడవరకు గొప్ప గోపురమునకు ఎదురుగానున్న మరియొక భాగమును తెకోవీయులు బాగుచేసిరి. 28వ. గుఱ్ఱపు గుమ్మమునకు పైగా యాజకులందరు తమ యిండ్ల కెదురుగా బాగుచేసిరి. 29వ. వారిని ఆనుకొని తన యింటికి ఎదురుగా ఇమ్మేరు కుమారుడైన సాదోకు బాగుచేసెను; అతని ఆనుకొని తూర్పు ద్వారమును కాయు షెకన్యా కుమారుడైన షెమయా బాగుచేసెను. 30వ. అతని ఆనుకొని షెలెమ్యా కుమారుడైన హనన్యాయును జాలాపు ఆరవ కుమారుడైన హానూనును మరియొకభాగమును బాగుచేయువారైరి; వారిని ఆనుకొని తనగదికి ఎదురుగా బెరెక్యా కుమారుడైన మెషుల్లాము బాగుచేసెను. 31వ. అతని ఆనుకొని నెతీనీయుల స్థలమునకు మిప్కాదు ద్వారమునకు ఎదురుగానున్న వర్తకుల స్థలము యొక్క మూలవరకును బంగారపు పనివాని కుమారుడైన మల్కీయా బాగుచేసెను. 32వ. మరియు మూలకును గొఱ్ఱెల గుమ్మమునకును మధ్యను బంగారపు పనివారును వర్తకులును బాగుచేసిరి.

## యెరూషలేము పట్టణ ప్రాకార గుమ్మములు.

1. గొఱ్ఱెల గుమ్మము (3:1–2వ.) 2) మత్స్యపు గుమ్మము (3:3వ.), 3) పాత గుమ్మము (నెహె 3:6–8వ.), 4) లోయ గుమ్మము (3:13వ.), 5) పెంట గుమ్మము (3:14వ.), 6) ధార గుమ్మము (3:15వ.), 7) నీటి గుమ్మము (3:26వ.), 8) గుఱ్ఱపు గుమ్మము (3:28వ.), 9) తూర్పు గుమ్మము (3:29వ.), 10 మిప్కాదు గుమ్మము – పరీక్ష గుమ్మము (3:31వ.) 11వ. గుమ్మము ఎఫ్రాయీము గుమ్మము 12:39వ వచనములో కనిపించును. 12వ గుమ్మము బందీ గృహ గుమ్మము 13:26వ వచనములో కనిపించును.

# నెహెమ్యా 4వ అధ్యాయము (6+8+9=23వ.)

## అంశము : ప్రార్థనతో యెరూషలేము ప్రాకార గోడ కట్టబడుట.

**1-6వ. శత్రువుల ఎగతాళి తిరస్కారముల మధ్య ప్రార్థనతో ముందుకు సాగుట :-** దేవుని ప్రజలైన యూదావారు గోడ కట్టుచున్న సంగతి శత్రువులైన హోదీనీయుడైన సన్బల్లటును, అమ్మోనీయుడైన దాసుడగు టోబీయా అనువాడును, అరబీయుడైన గెషెమును విన్నారు. ఇది మంచి సాక్షమే. ఈ దినములలో మనము దేవుని మందిరపని అనగా ఆత్మీయ మందిర గోడలు కట్టుచు పనిని భద్రపరచుచున్నామా? మన పనిని గూర్చి ఇతరులు వింటున్నారా ? క్రీస్తు అను బండ మీద కట్టుచున్నామా ? లేదా బుద్ధిహీనునివలె ఇసుకలో కట్టుచున్నామా ? మత్త 7:26-27వ. మరియు యీ నా మాటలు విని వాటిచొప్పున చేయని ప్రతివాడు ఇసుకమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. వాన కురిసెను, అప్పుడది కూలబడెను; క్రీస్తు అను బండ మీద కట్టబడు యిల్లు 1) మన వ్యక్తిగత జీవితానికి 2) మన కుటుంబ జీవితానికి 3) మన సంఘ జీవితానికి పోలికగా వున్నది. 1) పేతు 5:8వ. మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు. నిబ్బరమైన బుద్ధి గలవారై మెలకువగా ఉండుడని దేవుడు హెచ్చరించుచున్నాడు. సన్బల్లటు, టోబీయా, గెషెములు సాతాను, శరీరము. లోకము అను ముగ్గురు శత్రువులకు సాదృశ్యమని రెండవ అధ్యాయములో చూచితిమి. వారి నిరుత్సాహపు మాటలు లెక్క చేయకూడదు. 'దుర్బలులైన యీయూదులు ఏమి చేయుదురు ? తమంతట తామే యీ పని ముగింతురా ? బలులు అర్పించి బలపరచుకొందురా ? ఒక దినమందే ముగింతురా? కాల్చబడిన చెత్తను కుప్పలుగా పడిన రాళ్లను మరల బలమైనవిగా చేయుదురా ?'. ఆ ముగ్గురు నెహెమ్యా మరియు అతని యొద్దను ఉండివారు కట్టిన దానిపైన ఒక నక్క యెగిరినట్టయిన వారి రాతిగోడ పడిపోవునని అపహసించుచున్నారు. 4-6వ. నెహెమ్యా ఈలాగున ప్రార్థించాడు. మా దేవా ఆలకించుము, మేము తిరస్కారము నొందినవారము; వారి నింద వారి తలల మీదికి వచ్చునట్లు చేసి, వారు చెరపట్టబడినవారై వారు నివసించు దేశములోనే వారిని దోపునకు అప్పగించుము. వారు కట్టువారిని బట్టి నీకు కోపము పుట్టించియుండిరి గనుక, నీ యెదుట వారి పాపమును తుడిచి వేయకుము

అని ప్రార్థించాడు. అయినను పని చేయుటకు జనులకు మనస్సు కలిగియుండెను గనుక వారు గోడను కట్టుచుండిరి, అది సగము ఎత్తు కట్టబడియుండెను.

**7-14వ. ఆటంకాల మధ్య ప్రార్థనతో బలపరచబడి పని కొనసాగించుట :-** 2 దిన 36:15-23వ. దేవుని వాక్యమునకు విధేయత చూపకపోయినందున వారి పితరుల దేవుడైన యెహోవా తన జనులయందును తన నివాస స్థలమందును కటాక్షము గలవాడై వారియొద్దకు తన ప్రవక్తల ద్వారా వర్తమానము పంపుచు వచ్చెను. దేవుడు పెందలకడ లేచి ప్రవక్తలను తృణీకరించుచు, ఆయన ప్రవక్తలను హింసించుచు రాగా, నివారింపశక్యము కాకుండా యెహోవా కోపము ఆయన జనుల మీదికి వచ్చెను. ఆయన వారిమీదికి కల్దీయుల రాజును రప్పింపగా అతడు వారిని కనికరింప పరిశుద్ధ స్థలమగు మందిరములోనే ఖడ్గముచేత సంహరించునట్లు దేవుడు వారిని అతనిచేత కప్పగించెను. పారసీక దేశపురాజైన కోరెషు మొదటి సంవత్సరమున యెహోవా పారసీకదేశపు రాజైన కోరెషు మనస్సును ప్రేరేపింపగా అతడు తన రాజ్యమందంతటను ఆజ్ఞాపించాడు. అదేమనగా ఆకాశమందలి దేవుడైన యెహోవా లోకమందున్న సకల జనములను నా వశము చేసి, యూదా దేశమందున్న యెరూషలేముల తనకు మందిరమును కట్టించుమని నాకు ఆజ్ఞ ఇచ్చియున్నాడు; కావున మీలో ఎవరు ఆయన జనులైయున్నారో వారు బయలుదేరి మందిరమును; దాని పట్టణమును కట్టాలి. వారి దేవుడైన యెహోవా వారికి తోడుగా నుండునుగాక అన్నాడు. కనుక ఎజ్రా గ్రంథములో మందిరము కట్టబడినది. నెహెమ్యా గ్రంథములో గోడ కట్టబడుచున్నది. శత్రువులను సన్బల్లటు, టోబీయా, అరబీయులును, అమ్మోనీయులును, అష్డోదీయులును, యెరూషలేము యొక్క గోడలు కట్టబడెనని, బీటలన్నియు కప్పబడెనని వినినప్పుడు మిగుల కోపపడి యెరూషలేము మీదికి యుద్ధమునకు వచ్చి, పని ఆటంకపరచవలెనని కట్టుకట్టి మమ్మును కలతపరచగా, మేము దేవునికి ప్రార్థనచేసి, భయముచేత రాత్రింబగళ్లు కావలియుంటిమి.

10-14వ. అప్పుడు యూదావారు బరువులు మోయువారి బలము తగ్గిపోయెను, ఉన్న చెత్త విస్తారము, గోడ కట్టలేమని చెప్పగా, మా విరోధులును వారు తెలిసికొనకుండను చూడకుండను మనము వారిమధ్యకు చొరబడి వారిని చంపి పని ఆటంకపరచుదుమనిరి. మా శత్రువులయొద్ద నివాసులైయున్న యూదులు వచ్చినట్లు మీరు మా సహాయమునకు రావలెనని మాటిమాటికి మాతో చెప్పగా అందు నిమిత్తము గోడ వెనుకనున్న దిగువ

స్థలములలోను పైనున్న స్థలములలోను జనులను వారివారి కుటుంబముల ప్రకారముగా వారి కత్తులతోను వారి యీటెలతోను వారి విండ్లతోను నిలిపితిని. అంతట నేనులేచి చూచి మీరు భయపడకుడి, యెహోవాను జ్ఞాపకముచేసికొని, యుద్ధము చేయుడి అంటిని.

**15-23వ. పగలు, రాత్రి కాపుకాయుచు పనిచేయుట :-** వారి యోచన మాకు తెలియబడెనని, దేవుడు దానిని వ్యర్థము చేసెనని మా శత్రువులు సమాచారము వినగా, మాలో ప్రతివాడును తన దేవుడు దానిని వ్యర్థము చేసెనని మా శత్రువులు సమాచారము వినగా, మాలో ప్రతివాడును తన పనికి గోడ దగ్గరకు వచ్చెను. అయితే అప్పటినుండి నా పని వారిలో సగము మంది పనిచేయుచు వచ్చిరి, సగముమంది యీటెలు, బల్లెములు విండ్లు కవచములు ధరించినవారైవచ్చిరి; అధికారులు యూదులలో ఆయా యింటివారి వెనుక నిలిచిరి, గోడ కట్టువారును బరువులు మోయువారును, బరువులు ఎత్తువారును, ఒక్కొక్కరు ఒక చేతితో పనిచేసి ఒక చేతితో ఆయుధము పట్టుకొనియుండిరి. కత్తి హెబ్రీ 4:12వ. ప్రకారము సజీవమై, బలముగల రెండంచులుగల ఖడ్గముకంటె వాడిగాఉ ండి, ప్రాణాత్మలకు కీళ్లను మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు, హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించునది. కనుక దేవుని సువార్త ప్రకటించువారు వాక్యమను ఖడ్గమును మాత్రమే బోధించాలి.

18-20వ. మరియు కట్టువారిలో ఒక్కొక్కడు తన కత్తిని నడుమునకు బిగించుకొని గోడ కట్టుచు వచ్చెను, అప్పుడు నేను ప్రధానులతోను, అధికారులతోను మిగిలినవారితోను ఇట్లంటిని, పని మిక్కిలి గొప్పది, మనము గోడమీద ఒకరొకరికి చాలా యెడముగా ఉన్నాము. గనుక ఏ స్థలములో మీకు బాకానాదము వినబడునో అక్కడికి మా దగ్గరకు రండి, మన దేవుడు మన పక్షముగా యుద్ధము చేయును.

21-23వ. ఆ ప్రకారము మేము పనియందు ప్రయాసపడితిమి; సగముమంది ఉదయము మొదలుకొని నక్షత్రములు అగుపడువరకు ఈటెలు పట్టుకొనిరి. మరియు ఆ కాలమందు నేను జనులతో ప్రతివాడు తన పనివానితో కూడా యెరూషలేములో బస చేయవలెను. అప్పుడు వారు రాత్రి మాకు కాపుగా నుందురు, పగలు పనిచేయుదురని చెప్పితిని. ఈలాగున నేను గాని నా బంధువులుగాని నా పనివారుగాని నా వెంబడియున్న పారావారుగాని ఉదుకుకొనుటకు తప్ప మరి దేనికిని మా వస్త్రములను తీసివేయలేదు.

# నెహెమ్యా 5వ అధ్యాయము (6+7+6=19వ.)

## అంశము :- సర్వజనుల వలన ఆటంకములలో పని కొనసాగుట

**1-6వ. బీదలగు సహోదరులు ధనికులు దాసులుగా నుండుట :-** 1-3వ. యూదా ప్రజలు వారి భార్యలును తమ సహోదరులైన యూదుల మీద నెహెమ్యాకు కఠినమైన ఫిర్యాదు చేసిరి. ఏదనగా కొందరు మేము మా కుమారులు మా కుమార్తెలును అనేకులము కనుక మేము తిని బ్రదుకుటకు ధాన్యము మీయొద్ద తీసికొందుమనిరి. మరికొందరు క్షామమున్నందున మా భూములను ద్రాక్షతోటలను మా యిండ్లను కుదువపెట్టిరి. మరికొందరు రాజుగారికి పన్ను చెల్లించుటకై భూముల మీదను ద్రాక్షతోటల మీదను అప్పుచేసిరి. గనుక మీయొద్ద ధాన్యము తీసికొందుమనిరి. 4-5వ. మా ప్రాణము మా సహోదరుల ప్రాణమువంటిది కాదా ? మా పిల్లలు వారి పిల్లలను పోలినవారుకారా ? కొందరు తమ కుమారులను, కుమార్తెలను దాసులగుటకై అప్పగించగా ఇప్పటికిని కొందరు దాసత్వములో నున్నారు. భూములు, ద్రాక్షతోటలు అన్యుల వశమున నుండగా వారిని విడిపించుటకు శక్తి చాలకున్నదని ఫిర్యాదును చేసిరి. యూదా ప్రజలు కష్టపడి పనిచేసి కుటుంబములను పోషించాలి. ఎఫె 5:29వ. ప్రకారము ప్రతివాడు తన శరీరమగు కుటుంబమును పోషించి సంరక్షించుకొనాలి. వీరు ఆలాగు చేయక ఇతరులపై ఆధారపడుటను బట్టి నెహెమ్యా మిగుల కోపపడెను. యూదా ప్రజలు తమ సహోదరులను దాసులుగా చేసికొనకూడదు. లేవీ 25:13వ. ప్రకారము సునాద సంవత్సరమున మీలో ప్రతివాడు తన స్వాస్థ్యమును మరల పొందాలి. ఆలాగు జరుగుటలేదు కనుక నెహెమ్యా కోపపడుట సమంజసమే.

**7-13వ. నెహెమ్యా దిద్దుట :-** 7-10వ. అంతట నాలో నేనే యోచనచేసి ప్రధానులను అధికారులను గద్దించి మీరు మీ సహోదరులయొద్ద వడ్డి పుచ్చుకొనుచున్నారని చెప్పి వారిని ఆటంకపరచుటకై మహా సమాజమును సమకూర్చగా అన్యులకు అమ్మబడిన సహోదరులైన యూదులను విడిపించిరి, మరియు నేను మీరు చేయునది మంచిది కాదు, మన శత్రువులైన అన్యుల నిందనుబట్టి మన దేవునికి భయపడి మీరు ప్రవర్తింపవలెను. నెహెమ్యాయు, తన బంధువులును తన దాసులు గత కాలములో ఆలాగుననే సొమ్మును ధాన్యమును అప్పుగా ఇచ్చిరి. నెహెమ్యా తన బంధువులతోను

తన దాసులతోను వారందరితో మాటలాడి ఒప్పించగా వారందరు ఆ అప్పు పుచ్చుకొనకుందుమని చెప్పిరి.

11-13వ. ఈ దినములోనే ఎవరెవరి భూములను ద్రాక్షతోటలను, ఒలీవతోటలను యిండ్లను వారికి అప్పగించుడని నేను మిమ్మును బతిమాలుచున్నాను అంటిని. అందుకు వారు నీవు చెప్పిన ప్రకారమే యివన్నియు ఇచ్చివేసి వారియొద్ద ఏమియు కోరమనిరి. అంతట నేను యాజకులను పిలిచి ఈ వాగ్దాన ప్రకారము జరిగించుటకు వారిచేత ప్రమాణము చేయించితిని. మరియు నెహెమ్యా తన ఒడినిదులిపి ఈ ప్రకారమే దేవుడు వాగ్దానము నెరవేర్చని ప్రతివానిని తన పని ముగింపక నుండునట్లు దులిపివేయును గాకని చెప్పగా, సమాజకులందరు ఆలాగు కలుగును గాక అని చెప్పి యెహోవాను స్తుతించిరి. జనులందరు ఆలాగే జరిగించిరి.

**14-19వ. నెహెమ్యా మాదిరి :-** 14-16వ. మరియు నెహెమ్యా యూదా దేశములో అధికారిగా నిర్ణయింపబడిన కాలము మొదలుకొని, అనగా అర్తహషస్త రాజు ఏలుబడియందు ఇరువదియవ సంవత్సరము మొదలుకొని పంద్రెండు సంవత్సరములు అధికారికి రావలసిన సొమ్మును నెహెమ్యాకాని బంధువులుకాని తీసికొనలేదు. నెహెమ్యా ముందుగానుండిన అధికారులు జనులయొద్ద నుండి ఆహారమును ద్రాక్షారసమును నలువది తులముల వెండిని తీసికొనుచు వచ్చిరి. అయితే దేవుని భయముచేత నెహెమ్యా ఆలాగున చేయలేదు. ఇదియుగాక నెహెమ్యా ఈ గోడ పని చేయగా నెహెమ్యా పనివారును ఆ పని చేయుచు వచ్చిరి.

17-19వ. నెహెమ్యా భూమి సంపాదించుకొనలేదు. నా భోజనపు బల్లయొద్ద మా చుట్టునున్న అన్యజనులలో నుండి వచ్చినవారు గాక యూదులును, అధికారులును నూట ఏబదిమంది కూర్చునియుండిరి. నెహెమ్యా నిమిత్తము ప్రతిదినము, ఒక యెద్దును శ్రేష్ఠమైన ఆరు గొఱ్ఱెలును సిద్ధము చేయబడెను. ఇవియుగాక కోళ్లను, పదిరోజులకు ఒకమారు నానావిధమైన ద్రాక్షారసము సిద్ధము చేసితిని. ఈ ప్రకారముగా చేసినను ఈ జనుల దాసత్వము బహుకఠినముగా ఉండినందున అధికారికి రావలసిన సొమ్మును నేను ఆపేక్షించలేదు. నా దేవా, ఈ జనులకు నేను చేసిన సకలమైన ఉపకారములను బట్టి నాకు మేలు కలుగునట్లుగా నన్ను దృష్టించుమని ప్రార్థించెను.

# నెహెమ్యా 6వ అధ్యాయము (4+5+5+5=19వ.)

**అంశము : ఆటంకముల మధ్య యెరూషలేము పట్టణ ప్రాకారము యొక్క పని ముగింపు.**

**1-4వ. నెహెమ్యాకు హానిచేయుటకైన ఆలోచన :-**

1-2వ. నేను ఇంకను గుమ్మములకు తలుపులు నిలుపక ముందుగా దానిలో బీటలు లేకుండ సంపూర్ణముగా గోడను కట్టియుండగా, సన్బల్లటు, టోబీయా, అరబీయుడైన గెషెము మా శత్రువులలో మిగిలిన వారును విని సన్బల్లటును గెషెమును నాకు ఏదో హాని చేయుటకు ఆలోచించి ఓనో మైదానమందున్న గ్రామములలో ఒక దాని దగ్గర మనము కలిసికొందము రండని నాయొద్దకు వర్తమానముపంపిరి. శత్రువులు ఈ రీతిగా మనకు కీడు చేయతలంతురు.

3-4వ. అందుకు నేను చేయుపని గొప్పది, దాని విడిచి మీయొద్దకు వచ్చుటకై నేను దానినెందుకు ఆపవలెను ? నేను రాలేనని చెప్పుటకు దూతలనుపంపితిని. వారు ఆలాగున నాలుగు మారులు నాయొద్దకు వర్తమానముపంపగా ఆ ప్రకారమే నేను మరల ప్రత్యుత్తరమిచ్చితిని.

**5-9వ. నెహెమ్యాకు హానిచేయుటకై పత్రిక వ్రాయుట :-**

5-7వ. అంతట అయిదవ మారు సన్బల్లటు తన పనివాని ద్వారా విప్పియున్న యొక పత్రికను నెహెమ్యా యొద్దకు పంపెను. అందులో వారిపైన రాజుగా ఉండవలెనని నేను ప్రాకారమును కట్టుచున్నావని, ఈ హేతువు చేతనే నెహెమ్యా అను నేను యూదులు రాజు మీద తిరుగుబాటు చేయునట్లుగా ఆలోచించుచున్నానని, యూదులకు రాజుగా ఉన్నానని నన్ను గూర్చి ప్రకటన చేయుటకు యెరూషలేములో ప్రవక్తలను నియమించితినని రాజునకు ఈ సంగతులు తెలియనగునని మొదలగు మాటలను గూర్చిన సంగతి అన్యజనుల వదంతియని, దానిని గెషెము చెప్పుచున్నాడని వ్రాయబడెను.

8-9వ. ఈ పని చేయలేకుండ మేమశక్తులమగుదుమనుకొని వారందరు మమ్మును బెదరింప జూచిరి గాని నేను ఇటువంటి కార్యములను మేమెంత మాత్రమును చేయువారము కాము, వీటిని నీ మనస్సులోనుండి నీవు కల్పించుకొంటివని అతని యొద్దకు నేను వర్తమానము పంపితిని. దేవా, ఇప్పుడు నా చేతులను బలపరచుము.

**10-14వ. నెహెమ్యాను చంపుటకైన ఆలోచన :-**

10-11వ. అటు తరువాత మెహేతబేలునకు పుట్టిన దెలాయ్యా కుమారుడైన షెమయా యొక్క యింటికి వచ్చితిని. అతడు బయటికి రాకుండా నిర్భందింపబడెను. అతడు రాత్రికాలమందు నిన్ను చంపుటకు వారు వచ్చెదరు గనుక, దేవుని మందిర గర్భాలయము లోపలికి మనము పోయి తలుపులు వేసికొనెదమురండని చెప్పగా నేను నావంటివాడు పారిపోవచ్చునా ? ఇంతవాడనైన నేను నా ప్రాణమును రక్షించుకొనుటకైనను గర్భాలయమున ప్రవేశింపవచ్చునా ? నేను అందులో ప్రవేశింపనంటిని.

**12-14వ. టోబీయా నెహెమ్యాను చంప ప్రయత్నించగా నెహెమ్యా ప్రార్థించుట :-**

అప్పుడు దేవుడు అతని పంపలేదనియు, టోబీయాను సన్బల్లటును అతనికి లంచమిచ్చినందున యీ ప్రకటన చేసెనని నెహెమ్యా గుర్తించెను. ఇందువలన నెహెమ్యా భయము పుట్టగా, అతడు చెప్పినట్లు చేసిన పాపములో పడుదునని అనుకొనెను, చెడువార్త పుట్టించుటకు షెమయాకు వారు లంచమిచ్చియుండిరి. నా దేవా, వారి క్రియలను బట్టి టోబీయా, సన్బల్లటు నన్ను భయపెట్టవలెనని కనిపెట్టియున్న ప్రవక్తలను, నోవద్యా ప్రవక్తని జ్ఞాపకము చేసికొనుమని ప్రార్థించెను.

**15-19వ. ఆటంకాల మధ్య పని ముగింపు :-**

15-16వ. ఈ ప్రకారముగా ఏలూలు మాసము ఇరువది యయిదువ దినమందు, అనగా ఏబది రెండు దినములకు ప్రాకారమును కట్టుట సమాప్తమాయెను. అయితే మా శత్రువులు ఈ సంగతి వినినప్పుడును, మా చుట్టునుండు అన్యజనులందరు జరిగిన పని చూచినప్పుడును, వారు బహుగా అధైర్యపడిరి; ఏలయనగా ఈ పని మా దేవుని వలన జరిగినదని వారు తెలిసికొనిరి. 17-19వ. ఆ దినములలో యూదుల ప్రధానులు టోబీయా యొద్దకు మాటిమాటికి పత్రికలు పంపుచు వచ్చిరి; అతడును యూదుల ప్రధానులకు పత్రికలు పంపుచుండెను. అతడు ఆరహు కుమారుడైన షెకన్యాకు అల్లుడు. ఇదియుగాక యోహానాను అను తన కుమారుడు బెరెక్యా కుమారుడైన మెషుల్లాము కుమార్తెను వివాహము చేసికొనియుండెను గనుక యూదులలో అనేకులు అతని పక్షమున నుండెదమని ప్రమాణము చేసిరి. వారు నెహెమ్యా యెదుట టోబీయా గుణాతిశయములను గూర్చి మాటలాడుచు వచ్చిరి, నెహెమ్యా చెప్పిన మాటలు టోబీయాకు తెలియజేసిరి. నెహెమ్యాను భయపెట్టుటకే టోబీయా పత్రికలు పంపెనని నెహెమ్యా గుర్తించెను.

# నెహెమ్యా 7వ అధ్యాయము

## (4+17+13+4+4+3+11+4+2+3+4+4=73వ.)

**అంశము :- ద్వారపాలకులను గాయకులను లేవీయులను నియమించిన పిమ్మట హనానిని, హనన్యాను కోటకు అధిపతులుగా నియమించుట.**

**1-4వ. పనివారల నియామకము :-** నేను ప్రాకారమును కట్టి తలుపులు నిలిపి, ద్వారపాలకులను గాయకులను లేవీయులను నియమించిన పిమ్మట నా సహోదరుడైన హనానీకిని, కోటకు అధిపతియైన హనన్యాకును యెరూషలేముపైన అధికారము ఇచ్చితిని. హనన్యా నమ్మకమైన మనుష్యుడు, అందరి కంటె ఎక్కువగా దేవుని యెదుట భయభక్తులు గలవాడు. అప్పుడు నేను బాగుగా ప్రొద్దెక్కువరకు యెరూషలేము యొక్క గుమ్మముల తలుపులు తియ్యకూడదు; మరియు జనులు దగ్గర నిలువ బడియుండగా తలుపులువేసి అడ్డగడియలు వాటికి వేయవలెననియు, ఇదియు గాక యెరూషలేము కాపురస్థులందరు తమతమ కావలి వంతులను బట్టి, తమ యిండ్లకు ఎదురుగా కాచుకొనుటకు కావలి నియమింపవలెనని చెప్పితివి. అప్పటిలో ఆ పట్టణము మిగుల విశాలముగాను పెద్దదిగాను ఉండెనుగాని దానిలో జనులు కొద్దిగా ఉండిరి, యిండ్లు ఇంక కట్టబడలేదు.

**5-69వ. చెర నుండి తిరిగి వచ్చిన ప్రజలు, పనివారు, పశువుల లెక్కలు :-**

**5-38వ. చెరనుండి తిరిగి వచ్చిన ప్రజల వంశావళుల ప్రకారము జనసంఖ్య :-** జనసంఖ్య చేయునట్లు దేవుడు తలంపు పుట్టింపుగా ప్రధానులను, అధికారులను, జనులను నేను సమకూర్చితిని. అంతలోముందు వచ్చినవారిని గూర్చిన వంశావళి గ్రంథము నాకు కనబడెను. అందులో వ్రాయబడిన వంశావళులు ఇవి.

6వ. వచనమునుండి 25వ వచనమువరకు ప్రజల వంశావళులుల ప్రకారము జనసంఖ్యలు చెప్పబడ్డాయి. వీరందరి పేరులు అర్థసహితమైనవి కనుక వాటి ఆత్మీయ అర్థములను ధ్యానించుట మన ఆత్మీయ జీవితమునకు మంచిది.

**26-32వ. పట్టణముల వారిగా జనసంఖ్య :-** బేత్లెహేము నెటోపావారు నూట ఎనుబది యెనమండుగురు, అనాతోతువారు నూట ఇరువది యెనమండుగురు, బేతజ్మావెతువారు నలువది యిద్దరును, కిర్యత్యారీము కెఫీరా బెయేరోతులవారు ఏడువందుల నలువది ముగ్గురు రామా గెబలవారు ఆరువందల ఇరువది యొకరును, మిక్మషువారు నూట ఇరువది యిద్దరును, బేతేలు హాయిలవారు నూట ఇరువది ముగ్గురు.

**33-38వ. పట్టణముల వారిగా మరికొన్ని జనసంఖ్యలు :-** రెండవ నెబోవారు ఏబది యిద్దరును. రెండవ ఏలాము వారు వెయ్యిన్ని రెండువందల ఏబది నలుగురును, హారిము వంశస్థులు మూడువందల ఇరువది మందియు, యెరికో వంశస్థులు మూడువందల నలువది యయిదుగురును, హదీదు ఓనో అనువారి వంశస్థులు ఏడువందల ఇరువది యొకరును, సెనాయా వంశస్థులు మూడువేల తొమ్మిది వందల ముప్పది మంది. వీరందరికి పేరులు అర్థసహితమైనవి కనుక వాటి ఆత్మీయ అర్థములను ధ్యానించుట మన ఆత్మీయ జీవితమునకు మంచిది.

**39-42వ. చెర నుండి తిరిగి వచ్చిన యాజకులు :-** యాజకులలో యెషూవ యింటివారైన యెదాయా వంశస్థులు తొమ్మిదివందల డెబ్బది ముగ్గురును ఇమ్మేరు వంశస్థులు వెయ్యిన్న ఏబది యిద్దరును పషూరు వంశస్థులు వెయ్యిన్ని రెండువందల నలువది యేడుగురును హారిము వంశస్థులు వెయ్యిన్ని పదునేడుగురు. వీరందరి పేరులు అర్థసహితమైనవి కనుక వాటి ఆత్మీయ అర్థములను ధ్యానించుట మన ఆత్మీయ జీవితమునకు మంచిది.

**43-45వ. చెరనుండి తిరిగి వచ్చిన లేవీయులు, గాయకులు, ద్వారపాలకులు :-** లేవీయులైన యేషూవ హోదవ్యా కద్మీయేలు అనువారి వంశస్థులు డెబ్బది నలుగురును, గాయకులైన ఆసాపు వంశస్థులు నూట నలువదియెనమండుగురును, ద్వారపాలకులైన షల్లూము వంశస్థులు అటేరు వంశస్థులు టల్మోను వంశస్థులు అక్కూబు వంశస్థులు, హటీటా వంశస్థులు, షోబయి వంశస్థులు నూటముప్పదియెనమండుగురు.

**46-56వ. చెరనుండి తిరిగి వచ్చిన మందిర పరిచారకులగు నెతీనీయుల వంశస్థులు:-** నెతీనీయుల వంశస్థుల పేరులు చెప్పబడ్డాయి. వీరందరి పేరులు అర్థసహితమైనవి కనుక వాటి ఆత్మీయ అర్థములను ధ్యానించుట మన ఆత్మీయ జీవితమునకు మంచిది.

**57-60వ. సొలొమోను దాసుల వంశస్థులు :-** సోపెరెతు వంశస్థులు పెరూదా వంశస్థుల యహలా వంశస్థులు దర్కోను వంశస్థులు గిద్దేలు వంశస్థులు షెఫట్య వంశస్థులు హట్టీలు వంశస్థులు జెబాయీయుల సంబంధమైన పొకెరెతు వంశస్థులు ఆమోను వంశస్థులు, ఈ నెతీనీయులందరును సొలొమోను దాసుల వంశస్థులును మూడు వందల తొంబది యిద్దరు.

**61-62వ. వంశావళిని కనుపరచలేకపోయిన ప్రజలు :-** తేల్మెలహు తేల్హర్షా కెరూబు అదోను ఇమ్మేరు మొదలైన స్థలములనుండి వచ్చినవారు తాము ఇశ్రాయేలీయుల

సంబంధులో కారో తెలుపుటకు తమ యింటి పేరులైనను తమ వంశావళి పత్రికయైనను కనుపరచలేకపోయిరి. వారెవరనగా దొలాయ్యా వంశస్థులు టోబీయావంశస్థులు నెరోదావంశస్థులు వీరు ఆరువందల నలువది యిద్దరు. వీరందరి పేరులు అర్థసహిత మైనవి. కనుక వాటి ఆత్మీయ అర్థములను ధ్యానించుట మన ఆత్మీయ జీవితమునకు మంచిది.

**63-65వ. వంశావళిని కనుపరచలేక పోయిన యాజకులు :-** హబాయ్యా వంశస్థులు హక్కోజు వంశస్థులు బర్జిల్లయి వంశస్థులు అనగా గిలాదీయులైన బర్జిల్లయి కుమార్తెలలో ఒకతెను పెండ్లి చేసికొని వారి పేరుచేత పిలువబడిన బర్జిల్లయి వంశస్థులును యాజక సంతానులు. వీరి వంశావళులనుబట్టి యెంచబడినవారిలో వారి పద్దు పుస్తకమును వెదకగా అది కనబడకపోయెను. కాగా వారు అపవిత్రులుగా ఎంచబడి యాజకులలో ఉండకుండ వేరుపరచబడిరి. కాగా అధికారి ఊరీము తుమ్మీము అనువాటిని ధరించుకొని ఒక యాజకుడు ఏర్పడువరకు అతి పరిశుద్ధ వస్తువులను మీరు తినకూడదని వారితో చెప్పెను.

**66-69వ. సమాజకులందరు మొత్తము :-** సమాజకులందరును నలువది రెండువేల మూడువందల అరువదిమంది. వీరు గాక వీరి పనివారును పనికత్తెలును ఏడువేల మూడు వందల ముప్పది యేడుగురును, గాయకులలో స్త్రీ, పురుషులు రెండు వందల నలువది యయిదుగురునై ఉండిరి. వారి గుఱ్ఱములు ఏడువందల ముప్పది ఆరును, వారి కంచర గాడిదలు రెండువందల నలువది యయిదును. వారి ఒంటెలు నాలుగు వందల ముప్పది యయిదును వారి గాడిదలు ఆరువేల ఏడువందల ఇరువదియునై యుండెను.

**70-73వ. పనికి పనివారలకు సహాయము చేయబడిన వెండి, బంగారము, వస్త్రములు :-** 70 పెద్దలలో ప్రధానులైన కొందరు పనికి కొంత సహాయముచేసిరి. అధికారి ఖజానాలో నూట ఇరువది తులముల బంగారమును ఏబది పళ్లెములను ఏడువందల ముప్పది యాజక వస్త్రములను వేసి యిచ్చిరి. 71 మరియు పెద్దలలో ప్రధానులైనవారు కొందరు ఖజానాలో నూట నలువది తులముల బంగారమును రెండు వందల నలువది లక్షల తులముల వెండిని అరువది యేడు యాజక వస్త్రములను ఇచ్చిరి. 73 అప్పుడు యాజకులు లేవీయులు ద్వారపాలకులు, గాయకులు జనులలో కొందరును, నెతీనీయులు, ఇశ్రాయేలీయులందరును, తమ పట్టణముల యందు నివాసము చేసిరి.

# నెహెమ్యా 8వ అధ్యాయము (4+4+4+4+2=18వ.)

## అంశము :- నీటి గుమ్మము ఎదుట ధర్మశాస్త్ర గ్రంథమును చదివి వినిపించగా ప్రజలలో బ్రహ్మాండమైన ఉజ్జీవము కలుగుట.

**1-4వ. వాక్యము చదువుట :-** 1వ. ఏడవ నెల రాగా ఇశ్రాయేలీయులు తమ పట్టణములలో నివాసులై యుండగా నెహెమ్యా జనులందరిని ఏక మనస్కులై, నీటిగుమ్మము ఎదుటనున్న మైదానమునకు రమ్మన్నాడు. యెహోవా ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించిన మోషే ధర్మశాస్త్ర గ్రంథమును తెమ్మని ఎజ్రా అను శాస్త్రితో చెప్పాడు. 2-3వ. యాజకుడైన ఎజ్రా యేడవ మాసము మొదటి దినమున చదువబడుదాని గ్రహింప శక్తిగల స్త్రీ, పురుషులు కలిసిన సమాజమంతటి యెదుటను ఆ ధర్మశాస్త్ర గ్రంథము తీసికొనివచ్చి నీటి గుమ్మము ఎదుటనున్న మైదానములో ఉదయము మొదలుకొని మధ్యాహ్నమువరకు నిలుచున్న ఆ స్త్రీ పురుషులకు, తెలివితో వినగలవారికందరికిని చదివి వినిపించగా జనులందరును ధర్మశాస్త్ర గ్రంథమును శ్రద్ధతో వినిరి. నేటి నూతన నిబంధన కాల సంఘములలో కూడా బైబిలు గ్రంథమును శ్రద్ధతో విని మనమును దేవుని స్తుతించాలి. 4వ. అంతట శాస్త్రియగు ఎజ్రా ఆ పనికొరకు కఱ్ఱతో చేయబడిన యొక పీఠము మీద నిలువబడెను; మరియు అతని దగ్గర కుడిపార్శ్వమందు మత్తిత్యా, షెమ, అనాయా, ఊరియా, హిల్కీయా, మయశేయా అనువారు, అతని యెడమ పార్శ్వమందు పెదాయా, మిషాయేలు, మల్కీయా, హాషుము, హష్బద్దానా, జెకర్యా, మెషుల్లాము అనువారు నిలిచియుండిరి.

**5-8వ. జనులకు ఎజ్రా లేవీయులు ధర్మశాస్త్రము యొక్క తాత్పర్యమును చెప్పుట :-**

5-6వ. అప్పుడు ఎజ్రా అందరికంటె ఎత్తుగా నిలువబడి జనులందరును చూచుచుండగా గ్రంథమును విప్పగానే జనులందరు నిలువబడిరి. ఎజ్రా మహాదేవుడైన యెహోవాను స్తుతింపగా జనులందరు తమ చేతులెత్తి ఆమేన్ ఆమేన్ అని పలుకుచు, నేలకు ముఖములు వంచుకొని యెహోవాకు నమస్కరించిరి.

7-8వ. జనులు ఈలాగు నిలువబడుచుండగా యేషూవ, బానీ, షేరేబ్యా, యామీను, అక్కూబు, షబ్బెతై, హోదీయా, మయశేయా, కెలీటా, అజర్యా, యెజాబాదు, హానాను, పెలాయాలు, లేవీయులు ధర్మశాస్త్రము యొక్క తాత్పర్యమును తెలియజెప్పిరి. ఇటువలెనే

వారు దేవుని గ్రంథమును స్పష్టముగా చదివి వినిపించి జనులు బాగుగా గ్రహించునట్లు దానికి అర్థము చెప్పిరి.

**9-12వ. జనులను ఓదార్చుగా, జనులు గ్రహించి, సంభ్రమపడుట :-**

**9-10వ. జనులు ఓదార్చుట :-** జనులందరు ధర్మశాస్త్ర గ్రంథపు మాటలు విని తమ పాపములను బట్టి యేడ్వ మొదలుపెట్టగా, అధికారియైన నెహెమ్యా యాజకుడు శాస్త్రియునగు ఎజ్రాయును జనులకు బోధించు లేవీయులును మీరు దు:ఖపడవద్దు, ఏడ్వవద్దు, ఈ దినము మీ దేవుడైన యెహోవాకు ప్రతిష్ఠిత దినమని జనులతో చెప్పిరి. మరియు నెహెమ్యా వారితో నిట్లనెను పదండి, క్రొవ్విన మాంసము భక్షించి, పానము చేయుడి, ఇదివరకు తమకొరకు ఏమియు సిద్ధము చేసికొనని వారికి వంతులు పంపించుడి. ఏలయనగా ఈ దినము మన ప్రభువునకు ప్రతిష్ఠితమాయెను, దేవుడు వారికిచ్చిన మంచివాటన్నిటిని ఇతరులతో పంచుకొనుట ద్వారా వారు దు:ఖపడకుండ యెహోవాయందు ఆనందించి బలమొందిరి.

**11-12వ. జనులు గ్రహించి, సంభ్రమపడుట :-**

లేవీయులు జనులందరిని ఓదార్చి మీరు దు:ఖము మానుడి, ఇది పరిశుద్ధ దినము, మీరు దు:ఖపడకూడదని వారితో అనిరి. ఆ తరువాత జనులు తమకు తెలియజేయబడిన మాటలన్నిటిని గ్రహించి, తినుటకును, త్రాగుటకును లేనివారికి ఫలాహారములు పంపించుటకు సంభ్రమముగా ఉండుటకును ఎవరి యిండ్లకు వారు వెళ్లిరి.

**13-14వ. ఎజ్రా తన యొద్దకు ప్రధానులు, యాజకులు, లేవీయులు కూడిరాగా పర్ణశాలలో నివాసము చేయవలెనని ధర్మశాస్త్ర గ్రంథమునందు వ్రాయబడి యుండుట కనుగొనుట:-**

రెండవ దినమందు జనులందరి పెద్దలలో ప్రధానులైనవారును, యాజకులును, లేవీయులును ధర్మశాస్త్ర గ్రంథపు మాటలు వినవలెనని శాస్త్రియైన ఎజ్రా యొద్దకు కూడివచ్చిరి. యెహోవా మోషేకు దయచేసిన ధర్మశాస్త్ర గ్రంథములో చూడగా, ఏడవ మాసపు ఉత్సవకాలమందు ఇశ్రాయేలీయులు పర్ణశాలలో నివాసము చేయవలెనని వ్రాయబడియుండుట ఎజ్రా మరియు జనులు కనుగొనిరి. యెరూషలేము పట్టణ ప్రాకారము కట్టుపని ముగించక ముందు పర్ణశాలలు కట్టుకొనవలెనని గుర్తించిరి.

**15-16వ. జనులు యెరూషలేము పట్టణ ప్రకారము కట్టుపని ముగించి, పర్ణశాలలు కట్టుకొనుట :-** మరియు వారు తమ పట్టణములన్నిటిలోను యెరూషలేములోను

ప్రకటనచేసి తెలియజేయవలసినది ఏమనగా మీరు పర్వతమునకుపోయి, ఒలీవచెట్ల కొమ్మలను, అడవి ఒలీవచెట్ల కొమ్మలను, గొంజిచెట్ల కొమ్మలను, ఈతచెట్ల కొమ్మలను, గుబురు గల వేరు వేరు చెట్ల కొమ్మలను తెచ్చి, వ్రాయబడినట్లుగా పర్ణశాలలు కట్టవలెను. ఆ ప్రకారమే జనులు యెరూషలేము పట్టణ ప్రాకారము కట్టుపని ముగించి, పోయి కొమ్మలను తెచ్చి, జనులందరు తమ తమ యిండ్ల మీదను, తమ లోగిళ్ళలోను, దేవుని మందిరపు ఆవరణములోను, నీటి గుమ్మపు వీధిలోను, ఎఫ్రాయిము గుమ్మపు వీధిలోను పర్ణశాలలు కట్టుకొనిరి (6:16వ.)

ప్రాణాపాయము అంతటి ఆటంకములు వచ్చినను ఆటంకముల మధ్యనే యెరూషలేము పట్టణ ప్రాకారము కట్టుపని ఆగకుండ జరిగి కట్టబడు పని ముగించబడుటను గమనించండి. ఈ దినములలో కూడా దేవుని మందిరము, దాని పట్టణమగు యెరూషలేము ప్రాకారము కట్టబడు పనులు అనగా సువార్త ప్రకటించి ఆత్మలు సంపాదించబడి దేవుని సంఘము కట్టబడుట, పట్టణ ప్రాకారము కట్టబడుట అనగా సంఘములో వాక్యము ప్రకటించుట ద్వారా దేవుని ప్రజల ఆత్మీయ జీవితము భద్రపరచబడుట నిత్యము నూతన నిబంధన కాలసంఘములో జరుగుచుండాలి.

**17-18వ. పర్ణశాలలు కట్టుకొని పరిశుద్ధ సంఘముగా కూడుకొని దేవుని ధర్మశాస్త్ర గ్రంథమును చదివి సంతోషించుట :-** చెరలోనుండి తిరిగి వచ్చినవారు పర్ణశాలలు కట్టుకొని పరిశుద్ధ సంఘముగా కూడుకొని వాటిలో కూర్చుండి మొదటి దినము మొదలుకొని కడదినము వరకు అనుదినము ఎజ్రా దేవుని ధర్మశాస్త్ర గ్రంథమును చదవగా వినిరి. నూను కుమారుడైన యెహోషువ దినములు మొదలుకొని అదివరకు ఇశ్రాయేలీయులు ఆలాగున చేసియుండలేదు; వారు ఈ ఉత్సవమును ఏడు దినములవరకు విధి చొప్పున ఆచరించిన తరువాత ఎనిమిదవ దినమున వారు బహుగా సంతోషించిరి. పర్ణశాలలు కట్టుకొని పరిశుద్ధ సంఘముగా ఏడు దినములు కూడుకొని దేవుని ధర్మశాస్త్ర గ్రంథమును చదివి సంతోషించుట, పరలోకములో ప్రభువుతో ఏడు సంపూర్ణ సంఖ్య కనుక సంపూర్ణ కాలము ప్రభువుతో మనము వుండుటను సూచించుచున్నది.

# నెహెమ్యా 9వ అధ్యాయము (4+4+7+6+4+6+6=37వ.)

**1-4వ. మాదిరికరమైన ప్రార్థన :-** ఈ నెల యిరువది నాలుగవ దినమందు ఇశ్రాయేలీయులు ఉపవాసముండి, గోనె పట్టలు కట్టుకొని, తలమీద ధూళి పోసుకొనికూడి వచ్చిరి. ఇశ్రాయేలీయులు అన్య జనులందరిలో నుండి ప్రత్యేకింపబడినవారై, నిలువబడి, ఒక జాముసేపు తామున్న చోటనే నిలువబడి తమ దేవుడైన యెహోవా ధర్మశాస్త్ర గ్రంథమును చదువుచు ఒక జాముసేపు తమ పాపములను తమ పితరుల పాపములను ఒప్పుకొనుచు దేవుడైన యెహోవాకు నమస్కారము చేయుచువచ్చిరి.

ఇది మాదిరికరమైన ప్రార్థన. ప్రార్థనకు ముందు దేవుని వాక్యమును చదివి వాక్య ప్రకారము మన అనుదిన జీవితములో మనలో వున్న పాపమును ఒప్పుకొని దేవుని యెదుట మన జీవితములను సరిచేసుకొనాలి. 2 కొరిం 6:14-18వ. 'మీరు అవిశ్వాసులతో జోడుగా ఉండకుడి. నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము ? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు ? కావున మీరు వారి మధ్యనుండి బయలువెడలి ప్రత్యేకముగా ఉండుడి; అపవిత్రమైనదానిని ముట్టకుడని ప్రభువు చెప్పుచున్నాడు. మరియు నేను మిమ్మును చేర్చుకొందును. మీకు తండ్రినైయుందును.'

1 యోహా 3:19-21వ. 'మన హృదయము ఏయే విషయములలో మనయందు దోషారోపణ చేయునో ఆయా విషయములలో ఆయన యెదుట మన హృదయములను సమ్మతిపరచుకొందము. ప్రియులారా, మన హృదయము మనయందు దోషారోపణ చేయని యెడల దేవుని యెదుట ధైర్యముగలవారమగుదుము. మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయనకిష్టమైనవి చేయుచున్నాము గనుక, మనమేమి అడిగినను అది ఆయనవలన మనకు దొరుకును'. అన్యజనులందరిలోనుండి ప్రత్యేకింపబడుట, దేవుడైన యెహోవా ధర్మశాస్త్ర గ్రంథమును చదువుచు పాపములను ఒప్పుకొని ప్రార్థించిన మనమేమి అడిగినను అది ఆయనవలన మనకు దొరుకును. నేటి దినములలో మనమందరము ఇటువంటి ప్రార్థన చేయుదుముగాక.

**5-8వ. దేవుని గుణములను బట్టి లేవీయులు, ప్రజలు దేవుని స్తుతించుట :-**

5-6వ. లేవీయులు ప్రజలు నిలువబడి దేవుని గొప్పతనమును జ్ఞాపకము చేసికొని, నిరంతరము దేవుడైయున్న యెహోవాను స్తుతించుడని చెప్పి ఈలాగు స్తోత్రము చేసిరి.

సకలాశీర్వచన స్తోత్రములకు మించిన నీ ఘనమైన నామము స్తుతింపబడునుగాక. నీవే, అద్వితీయుడవైన యెహోవా, నీవే ఆకాశమును, మహాకాశముల, వాటి సైన్యమును, భూమిలో దానిలో ఉండునది అంతటిని, సముద్రములను వాటిలో ఉండునది అంతటిని, సృజించి వాటినన్నిటిని కాపాడువాడవు. ఆకాశ సైన్యమంతయు నీకే నమస్కారము చేయుచున్నది.

7-8వ. దేవా, యెహోవా అబ్రామును ఏర్పరచుకొని, కల్దీయుల ఊరు అను స్థలము నుండి ఇవతలకు రప్పించి అతనికి అబ్రాహామను పేరు పెట్టినవాడవు నీవే. 8 అతడు నమ్మకమైన మనస్సుగల వాడని యెరిగి, కనానీయులు, హిత్తీయులు, అమోరీయులు, పెరిజ్జీయులు, యోబూసీయులు, గిర్గాషీయులు అనువారి దేశము అతని సంతతి వారి కిచ్చునట్లు అతని నిబంధన చేసినవాడవు నీవే అని జ్ఞాపకము చేసిరి.

**9-15వ. రక్షణను బట్టి, కాపుదలనుబట్టి దేవుని స్తుతించుట :-**

9. నీవు నీతిమంతుడవైయుండగా నీ మాట చొప్పున జరిగించితివి. ఐగుప్తులో మా పితరులు పొందిన శ్రమనుండి వారిని రక్షించితివి. ఎఱ్ఱ సముద్రమునొద్ద వారి మొఱ్ఱను నీవు విని వారిని ఫరో యొక్క శ్రమనుండి రక్షించితివి. ఫరో అతని దాసులందరును అతని దేశపు జనులందరు వారి యెడల బహు గర్వము ప్రవర్తించిరని నీకు తెలియగా నీవు ఫరో యెదుట సూచక క్రియలను మహత్కార్యములను చూపించితివి. అలాగున చేయుట వలన నీవు ఈ దినమందున్నట్లుగా ప్రసిద్ధినొందితిని.

**11-12వ. ఇశ్రాయేలీయులను కాపాడి, ఫరోను నీటిలో ముంచివేయుట :-** ఎఱ్ఱ సముద్రమును విభాగించినందున ఇశ్రాయేలీయులు సముద్ర పొడినేలను నడచి కాపాడబడిరి, ఒకడు లోతునీట రాయి వేసినట్లు ఫరో అతని సైన్యము అగాధ జలములలో పడవేయబడిరి. పగటికాలమందు మేఘస్తంభములో ఉండి, రాత్రి కాలమందు వారు వెళ్లవలసిన మార్గమున వెలుగిచ్చుటకై అగ్నిస్తంభములో ఉండి ఇశ్రాయేలీయులను కనాను దేశమునకు తోడుకొనిపోతివి.

13-15వ. సీనాయి పర్వతము మీదికి దిగివచ్చి ఆకాశమునుండి వారితో మాటలాడి, వారికి నీతియుక్తమైన విధులను సత్యమైన ఆజ్ఞలను మేలురకములైన కట్టడలను నీవు దయచేసితివి. వారికి నీ పరిశుద్ధమైన విశ్రాంతి దినమును ఆచరింప ఆజ్ఞఇచ్చి నీ దాసుడైన మోషే ద్వారా ఆజ్ఞలను, కట్టడలను ధర్మశాస్త్రమును వారికి నియమించి వారి

ఆకలి తీర్చుటకు ఆకాశమునుండి ఆహారమును, దాహము తీర్చుటకు బండలోనుండి నీరును తెప్పించితివి. వారికి ప్రమాణము చేసిన దేశమును స్వాధీనపరచుకొనవలెనని వారికాజ్ఞాపించితివి.

**16-21వ. పాపము తిరుగుబాటును చేసినను, ఇశ్రాయేలీయులు క్షమించి మేలులు చేయుటకు సిద్ధమనసుగల దేవుడు :-**

**16-18వ. ఇశ్రాయేలీయులు అరణ్య ప్రయాణములో చేసిన తిరుగుబాటు :-** ఇశ్రాయేలీయులు అరణ్య ప్రయాణములో 1) గర్వించి 2) లోబడనొల్లక 3) దేవుని ఆజ్ఞలకు చెవియొగ్గకపోయిరి. (వివరములు 26-31 వచనములలో కలవు) 4) విధేయులగుటకు మనస్సులేనివారై తమ మధ్య దేవుడు చేసిన అద్భుతములను జ్ఞాపకము చేసికొనక 5) తమ మనస్సును కఠినపరచుకొని, 6) తాముండి వచ్చిన దాస్యపు దేశమునకు తిరిగి వెళ్లుటకు ఒక అధికారిని కోరుకొని 7) నీ మీద తిరుగుబాటు చేసిరి. అయితే నీవు 1) క్షమించుటకు సిద్ధమైన దేవుడవును, 2) దయా, 3) వాత్సల్యతలు గలవాడవును, 4) దీర్ఘశాంతమును 5) బహు కృపగలవాడవునైయుండి 6) వారిని విసర్జింపలేదు. 8) వారు ఒక పోత దూడను చేసికొని 9) ఐగుప్తులోనుండి మమ్మును రప్పించిన దేవుడు ఇదే అని చెప్పి, 10) నీకు బహు విసుకుపుట్టించిరి.

**19-21వ. దేవుడు ఇశ్రాయేలీయుల పట్ల చూపిన విస్తారమైన కృప :-** ఇశ్రాయేలీయులు ఎడారిలో ఉండగా దేవుడు బహు విస్తారమైన కృపగలిగినవాడై 1) వారిని విసర్జింపలేదు 2) మార్గముగుండా వారిని తోడుకొనిపోవుటకు పగలు మేఘస్తంభము 3) దారిలో వారికి వెలుగిచ్చుటకు రాత్రి అగ్నిస్తంభమును వారిపై నుండి వెళ్లిపోక నిలిచెను. 4) వారికి బోధించుటకు నీ యుపకారాత్మను దయచేసితివి 5) నీవిచ్చిన మన్నాను ఇయ్యక మానలేదు. 6) వారి దాహమునకు ఉదకమిచ్చితివి. 7) నిజముగా అరణ్యములో ఏమియు తక్కువ కాకుండా నలువది సంవత్సరములు వారిని పోషించితివి 8) వారి వస్త్రములు పాతగిలిపోలేదు 9) వారి కాళ్లకు వాపు రాలేదు 10) వారి చెప్పులు తెగిపోలేదు.

**26-31వ. ప్రజల తిరుగుబాలు దేవుని కృప, కనికరము :-**

20. నీ ఆజ్ఞలను, విధులను ఒకడు ఆచరించిన యెడల వాటివలన వాడు బ్రదుకునుగదా. వారు మరల నీ ధర్మశాస్త్రము ననుసరించి నడుచునట్లు నీవు వారి మీద సాక్ష్యము పలికినను, వారు గర్వించి నీ ఆజ్ఞలకు లోబడక, నీ విధుల విషయములో పాపులై నిన్ను

తిరస్కరించి తమ మనస్సును కఠినపరచుకొని నీ మాట వినపోయిరి. 30. నీవు అనేక సంవత్సరములు వారిని ఓర్చి, నీ ప్రవక్తల ద్వారా నీ ఆత్మచేత వారి మీద సాక్ష్యము పలికితివి గాని వారు వినకపోయిరి; కాగా నీవు ఆయా దేశములలో నున్న జనుల చేతికి వారిని అప్పగించితివి. 31. అయితే నీవు మహోపకారివై యుండి, వారిని బొత్తిగా నాశనము చేయకయు విడిచి పెట్టకయు ఉంటివి. నిజముగా నీవు కృపా, కనికరములుగల దేవుడవైయున్నావు.

**32-37వ. శ్రమలనుండి విడుదల కొరకు సహాయము చేయుమని దేవుని వేడుకొనుట:-**

32-34వ. ఇశ్రాయేలీయులు దుర్మార్గులై దేవుని ధర్మశాస్త్రము ననుసరించి నడువలేదు. శత్రువులు తమకిష్టము వచ్చినట్లు మా శరీరముల మీదను, మా పశువుల మీదను అధికారము చూపుచున్నారు గనుక మాకు చాలా శ్రమలు కలుగుచున్నవి.

35-37వ. దేవుడు చూపించిన గొప్ప ఉపకారములను తలంచక, నీవు వారికిచ్చిన విస్తారమగు ఫలవంతమైన భూమిని అనుభవించియుండియు తమ చెడు నడతలు విడిచి మారుమనస్సు పొందక నిన్ను సేవింపకపోయిరి. కనుక మా పితరులకు దయచేసిన భూమియందు మేము దాసులమైయున్నాము. దాని ఫల సమృద్ధిని అనుభవించునట్లు నీవు మా పాపములను క్షమించి అతి విస్తారముగా స్థలమిచ్చుచున్న మా భూమిని మాకు దయచేయుమని ప్రార్థించిరి.

# నెహెమ్యా 10వ అధ్యాయము (8+5+13+3+10=39వ.)

## అంశము :- యూదులు చేసిన నిబంధనలు, నిర్ణయములు

**1-13వ. నిబంధనకు ముద్రవేసిన యాజకులు, లేవీయులు :-**

**1-8వ. నిబంధనకు ముద్రవేసిన యాజకులు :-**

1) మేము ఒప్పుకొని చెప్పిన దానినిబట్టి ఒక స్థిరమైన నిబంధన చేసికొని వ్రాయించుకొనగా, మా ప్రధానులును, లేవీయులును, యాజకులును దానికి ముద్రలు వేసిరి. దానికి ముద్రలు వేసినవారెవరనగా, అధికారియగు హకల్యా కుమారుడైన నెహెమ్యా, సిద్కియా, 2) శెరాయా, అజర్యా, యిర్మీయా 3) పషూరు, అమర్యా, మల్కీయా 4) హట్టూషు, షెబన్యా, మల్లూకు 5) హారిము మెరేమోతు ఓబద్యా 6) దానియేలు గిన్నెతోను బారూకు 7) మెషుల్లాము అబీయా మీయామిను 8) మయజ్యా బిల్గయి షెమయా వీరందరును యాజకులుగా ఉండువారు.

**9-13వ. నిబంధనకు ముద్రవేసిన లేవీయులు :-** లేవీయులు వారి కుమారులు దేవుని మందిరపు సేవ నిమిత్తము నిబంధనను అంగీకరించి ముద్రవేయుట ఎంతో సంతోషించతగినది. నేటి కాల నూతన నిబంధన సంఘములలో ఆలాగే సేవకులు అంగీకరించుట అవసరము.

**14-26వ. నిబంధనకు ముద్రవేసిన జనులు :-** ప్రధానులు జనులలో అనేకులు దేవుని మందిరపు సేవ నిమిత్తము నిబంధనను అంగీకరించి ముద్రవేయుట గమనించండి. నూతన నిబంధన సంఘములలో ఆలాగే విశ్వాసులు అంగీకరించి ముద్రవేయుట అవసరము.

**27-39వ. నిబంధనలోని అంశములు :-** అయితే జనులలో మిగిలినవారు, అనగా దేవుని ధర్మశాస్త్రమునకు విధేయులగునట్లు దేశపు జనులలో ఉండకుండ తమ్మును తాము వేరుపరచుకొనిన యాజకులు లేవీయులు ద్వారపాలకులు గాయకులు నెతీనీయులు అందరికొరకు, దేవుని దాసుడైన మోషే ద్వారా దేవుడు నిర్ణయములు చేయించాడు.

27-29వ. ధర్మశాస్త్రము ననుసరించి నడుచుకొనుచు, ప్రభువైన యెహోవా నిబంధనలను కట్టడలను ఆచరించుదుమని శపథము పూనిరి. దేవుని ధర్మశాస్త్రము ననుసరించి నడుచుకొనుచు, మన ప్రభువైన యెహోవా నిబంధనను కట్టడలను

ఆచరించుదుమని శపథము పూని ప్రమాణము చేయుటకు ప్రధానులు, వారి కుమారులు, బంధువులతో కూడిరి. వారి భార్యలు, వారి కుమారులు, కుమార్తెలు తెలివియు, బుద్ధియు గలవారెవరో వారును ఈ విషయములో కలిసిరి.

**1. 30-31వ. మొదటి నిర్ణయము :-** మరియు మేము దేశపు జనులకు మా కుమార్తెలను ఇయ్యకయువారి కుమార్తెలను మా కుమారులకు పుచ్చుకొనకయు నుందుమని దేశపు జనులు విశ్రాంతి దినమందు అమ్మకపు వస్తువులనే గాని భోజన పదార్థములనేగాని అమ్ముటకు తెచ్చిన యెడల విశ్రాంతి దినమునగాని పరిశుద్ధ దినములలో గాని వాటిని కొనకుందుమనియు, ఏడవ సంవత్సరము విడిచిపెట్టి ఆ సంవత్సరములో బాకీదారుల బాకీలు వదలి వేయుదుమనియు నిర్ణయించుకొంటిమి.

**2. 32వ. రెండవ నిర్ణయము :-** మన దేవుని మందిరపు సేవ నిమిత్తము ప్రతి సంవత్సరము తులము వెండిలో మూడవవంతు ఇచ్చెదమని నిబంధనచేసికొంటిమి. దేవుని మందిరపు సేవ నిమిత్తము ప్రతి విశ్వాసి ఇచ్చుట నేర్చుకోవాలి.

**3. 33వ. మూడవ నిర్ణయము :-** సవరింపబడిన రొట్టె విషయములోను, నిత్యనైవేద్యము విషయములోను, నిత్యము అర్పించు దహనబలి విషయములలోను, విశ్రాంతి దినముల విషయములోను, అమావాస్యల విషయములోను, నిర్ణయింపబడిన పండుగల విషయములోను, ప్రతిష్ఠితములైన వస్తువుల విషయములలోను, ఇశ్రాయేలీయుల ప్రాయశ్చిత్తము కలుగుటకైన పాపపరిహారార్థబలుల విషయములోను, మన దేవుని మందిరపు పనియంతటి విషయములోను, ఆలాగుననే నిర్ణయించుకొంటిమి.

ప్రత్యక్ష గుడారములో పాపపరిహారార్థబలి, సమాధానబలి, పాపపరిహారార్థబలుల ఉన్నట్లు నేటికాల విషయములలో క్రీస్తు రక్తము ద్వారా పాపక్షమాపణ కార్యము అనగా రక్షించబడుట నిత్యము జరగాలి. దేవునితో సమాధానపడుట ముఖ్యముగా ఆదివారపు ఆరాధన - ప్రభువు బల్ల కార్యము ఎడతెగక ఉండాలి. దహనబలి అనగా దేవునికి ఆయన సేవకై సంపూర్ణముగా సమర్పించుకోవాలి.

**4. 34వ. నాల్గవ నిర్ణయము :-** మరియు మా పితరుల యింటి మర్యాద ప్రకారము ప్రతి సంవత్సరమును నిర్ణయించుకొనిన కాలములలో ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాసియున్నట్టు మా దేవుడైన యెహోవా బలిపీఠము మీద దహింపజేయుటకు యాజకులలోను, లేవీయులలోను, జనులలోను కట్టెల అర్పణమును మా దేవుని

మందిరములోనికి ఎవరు తేవలెనో వారును చీట్లు వేసికొని నిర్ణయించుకొంటిమి. దీనిని మందిరములో సమర్పించబడు కానుకలుగా తలంచవచ్చును.

**5. 35వ. ఐదవ నిర్ణయము :-** మరియు మా భూమి యొక్క ప్రథమ ఫలములను సకల వృక్షముల ప్రథమ ఫలములను, ప్రతి సంవత్సరము ప్రభువు మందిరమునకు మేము తీసికొని వచ్చునట్లుగా నిర్ణయించుకొంటిమి. ప్రతి సంవత్సరము ప్రభువు మందిరమునకు మేము తీసికొని వచ్చు భూమి యొక్క ఫలములను సకల వృక్షముల ఫలములను మందిర కార్యక్రమములకు ఇవ్వబడు దశమ భాగములుగా తలంచవచ్చును.

**6. 36వ. ఆరవ నిర్ణయము :-** మా కుమారులలో జ్యేష్ఠపుత్రులు, మా పశువులలో తొలిచూలులను, ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడినట్టు మా మందలలో తొలిచూలులను, మన దేవుని మందిరములో సేవచేయు యాజకులయొద్దకు మేము తీసికొని వచ్చునట్లుగా నిర్ణయించుకొంటిమి. కుమారులలో జ్యేష్ఠ పుత్రులు, పశువులలో తొలిచూలులను, మందిర కార్యక్రమములకు ఇవ్వబడు ప్రథమ ఫలములుగా తలంచవచ్చును. సంఖ్యా 18:1-13వ. వారు యెహోవాకు అర్పించు వారి ప్రథమ ఫలములను, అనగా నూనెలో ప్రశస్తమైనదంతయు, ద్రాక్షారస ధాన్యములలో ప్రశస్తమైనదంతయు నీకిచ్చితిని. వారు తమ దేశపు పంటలన్నిటిలో యెహోవాకు తెచ్చు ప్రథమ ఫలములు లేవీయులవగును.

**7. 37వ. ఏడవ నిర్ణయము :-** ఇదియుగాక మా పిండిలో ప్రథమ ఫలము ప్రతిష్ఠార్పణలు సకల విధమైన వృక్షముల ఫలములు ద్రాక్షారసము నూనె మొదలైన వాటిని మా దేవుని మందిరపు గదులలోనికి యాజకుల యొద్దకు తెచ్చునట్లుగా, మా భూమి పంటలో పదియవవంతును లేవీయులయొద్దకు తీసికొనివచ్చునట్లుగా ప్రతి పట్టణములోనున్న మా పంటలో పదియవంతును లేవీయులకిచ్చునట్లుగాను నిర్ణయించు కొంటిమి. ఇది సంఖ్యా 18:21వ. యొక్క నెరవేర్పు. 'ఇదిగో లేవీయులు చేయు సేవకు, అనగా ప్రత్యక్షపు గుడారము యొక్క సేవకు నేను ఇశ్రాయేలీయులయొక్క దశమ భాగములన్నిటిని వారికి స్వాస్థ్యముగా ఇచ్చితిని'. 1 కొరిం 9:13-14వ. 'ఆలయ కృత్యములు జరిగించువారు ఆలయము వలన జీవనము చేయుచున్నారనియు, బలిపీఠము నొద్ద కనిపెట్టుకొనియుండువారు బలిపీఠముతో పాలివారైయున్నారనియు మీరెరుగరా? ఆలాగున సువార్త ప్రకటించువారు సువార్తవలన జీవింపవలెనని ప్రభువు నియమించి యున్నాడు.' నేటి కాల నూతన నిబంధన సంఘములలో ఆలాగే సువార్త ప్రకటనకు

తమ్మును తాము అప్పగించుకొనిన సువార్త సేవకులకు సంఘములో సమకూడు దశమభాగములన్నిటిని ఇవ్వాలి.

**8. 38-39వ. ఎనిమిదవ నిర్ణయము :-** లేవీయులు ఆ పదియవ వంతును తీసికొనిరాగా అహరోను సంతతివాడైన యాజకుడు ఒకడును వారితో కూడ ఉండవలెననియు, పదియవ వంతులలో ఒకవంతు లేవీయులు మా దేవుని మందిరములో ఉన్న ఖజానా గదులలోనికి తీసికొని రావలెననియు నిర్ణయించుకొంటిమి, ఇశ్రాయేలీయులును లేవీయులును ధాన్యమును క్రొత్త ద్రాక్షారసమును నూనెను తేగా, సేవచేయు యాజకులును ద్వారపాలకులును గాయకులును వాటిని తీసికొని ప్రతిష్ఠితములగు ఉపకరణములుండు మందిరపు గదులలో ఉంచవలెను. ఆలాగే లేవీయులవలె మందిరమునుండి దశమ భాగములు పుచ్చుకొను సువార్తికులు తాము పుచ్చుకొను పదియవ వంతులలో ఒకవంతు లేవీయులవలె దేవుని మందిరములో ఉన్న ఖజానా గదులలోనికి తీసికొని రావలెనని గుర్తింతము. దేవుని మందిరము విడిచిపెట్టక మందిరములో నిత్య కార్యక్రమములు జరిగించాలి.

# నెహెమ్యా 11వ అధ్యాయము (3+17+16=36వ.)

## అంశము :- ప్రాకార ప్రతిష్ఠ

**1-3వ. యెరూషలేములో నివసించుటకు సంతోషముగా ఒప్పుకొనిన జనులు, అధికారులు, ప్రధానులు :-** జనుల అధికారులు యెరూషలేములో నివాసము చేసిరి. మిగిలిన జనులు పరిశుద్ధ పట్టణమగు యెరూషలేమునందు పది మందిలో ఒకడు నివసించునట్లును, మిగిలిన తొమ్మండుగురు వేరు పట్టణములలో నివసించునట్లు చీట్లువేసిరి. యెరూషలేములో నివసించుటకు సంతోషముగా ఒప్పుకొనిన వారిని జనులు దీవించిరి. యెరూషలేములో నివాసము చేసిన రాజ్యపు ప్రధానులు వీరే, యూదా పట్టణములలో ఎవరి స్వాస్థ్యములో వారు నివసించుచుండిరి. వారెవరనగా ఇశ్రాయేలీయులు యాజకులు లేవీయులు నెతీనీయులు సొలొమోను యొక్క దాసుల వంశస్థులును నివాసము చేసిరి. యెరూషలేము మీదికి అనేకమంది అన్యరాజులు వచ్చి యుద్ధము చేసి పట్టణమును పాడుచేసిరి. కనుక ప్రజలు యెరూషలేములో నివాసము చేయుచు మిగిలిన జనులు పరిశుద్ధ పట్టణమగు యెరూషలేమునందు పదిమందిలో ఒకడు నివసించునట్లు చీట్లు వేసి తీర్మానించిరి. ఆ ప్రధానుల పేరులు ఇక్కడ చెప్పబడ్డాయి. వీరి పేరులు అర్థసహితమైనవి కనుక వాటి ఆత్మీయ అర్థములను ధ్యానించుట మన ఆత్మీయ జీవితమునకు మంచిది.

**4-20వ. యెరూషలేములో నివసించిన యూదా, బెన్యామీను ప్రజలు ప్రధానులైన పెద్దలు, యాజకులు, లేవీయులు :-** యెరూషలేములో యూదా, బెన్యామీను ప్రజలలో కొందరును ప్రధానులైన పెద్దలు, యాజకులలో కొందరు నివసించిరి. ఇశ్రాయేలీయులలో శేషించిన యాజకులు, లేవీయులు మొదలైనవారు యూదా పట్టణములన్నిటిలో ఎవరి స్వాస్థ్యములో వారు ఉండిరి. వీరి పేరులు అర్థసహితమైనవి కనుక వాటి ఆత్మీయ అర్థములను ధ్యానించుట మన ఆత్మీయ జీవితమునకు మంచిది.

**21-36వ. యెరూషలేములో నివసించిన మిగిలినవారు :-** యెరూషలేములో నివసించిన ఇతరులు, లేవీయులు, గాయకులగు ఆసాపు కుమారులు, యూదా వంశస్థులలో కొందరి పేరులు పట్టణముల వరుస క్రమములో చెప్పబడ్డాయి. వీరందరి పేరులు అర్థసహితమైనవి కనుక వాటి ఆత్మీయ అర్థములను ధ్యానించుట మన ఆత్మీయ జీవితమునకు మంచిది.

# నెహెమ్యా 12వ అధ్యాయము

**(7+4+10+2+3+3+8+3+2+2+3=47వ.)**

**అంశము :- ప్రధానులైన యాజకులు లేవీయులు సమకూడి ప్రాకారమును ప్రతిష్ఠించుట.**

1-23వ. ప్రధానులైన యాజకులు, లేవీయులు వారి బంధువులు సమకూడుట :-

జెరుబ్బాబెలు నాయకత్వము క్రింద క్రీ.పూ. 536లో, ఎజ్రా నాయకత్వము క్రింద క్రీ.పూ. 458లో, నెహెమ్యాల నాయకత్వము క్రింద క్రీ.పూ. 424లో మూడు విడతలుగా యెరూషలేమునకు వచ్చిన వారిని తలంచవచ్చును.

**1-7వ. జెరుబ్బాబెలుతో వచ్చిన యేషూవ దినములలోని ప్రధానులైన యాజకులు :-** పారశీక రాజగు కోరెషు ఆజ్ఞ ప్రకారము జెరుబ్బాబెలుతో వచ్చిన 22 నుండి యాజకులు పేర్లు చెప్పబడ్డాయి.

**8-11వ. జెరుబ్బాబెలుతో కూడ వచ్చిన ప్రధానులైన లేవీయులు :-** జెరుబ్బాబెలుతో కూడ వచ్చిన ప్రధానులైన లేవీయుల 16 పేరులు చెప్పబడ్డాయి. వీరి పేరులు కూడా అర్థసహితమైనవి కనుక వాటి అర్థములను ఆత్మీయముగా ధ్యానించుట మంచిది.

12-21వ. యోయాకీము దినములలో యాజక కుటుంబ ప్రధానులలో 19 మంది పేరులు చెప్పబడ్డాయి. వీరి పేరుల అర్థములు ధ్యానించుట మంచిది.

22-23వ. ఎల్యాషీబు కుమారుడైన యోహానాను దినములలో పితరులలో లేవీయుల కుటుంబ ప్రధానుల మూడు పేరులు చెప్పబడ్డాయి. వాటి అర్థములను ఆత్మీయముగా ధ్యానించుట మంచిది.

24-27వ. ప్రాకారమును ప్రతిష్ఠించుట.

**24-26వ. స్తుతి పాటలు పాడుటకు, ద్వారపాకులుగా ఉండుటకు నియమించబడినవారు :-** స్తుతిపాటలు పాడుటకు ముగ్గురు, ద్వారపాలకులుగా ఉండుటకు ఆరుగురు నిర్ణయింపబడి తమ పనులను ఎజ్రా నెహెమ్యా దినములలో జరుపుచు వచ్చిరి.

**27-29వ. గాయకుల వంశస్థులు జనులు ప్రాకార ప్రతిష్ఠకు యెరూషలేముకు వచ్చుట:-** యెరూషలేము ప్రాకారమును ప్రతిష్ఠించు కాలములో వారు ఆ ప్రతిష్ఠాచారమును స్తోత్ర గీతములతోను స్వరమండల సితారా చేయి తాళములతోను సంతోషముగా జరిగించునట్లు

లేవీయులు ప్రజలు సకల స్థలములలో నుండి యెరూషలేమునకు వచ్చిరి. వీరి పేరులు అర్థసహితమైనవి కనుక వాటి అర్థములను ఆత్మీయముగా ధ్యానించుట మంచిది.

**30-31వ. యాజకులు, లేవీయులు తమ్మును గుమ్మములను, ప్రాకారమును పవిత్రపరచుట మందిరమును ప్రవిత్రపరచుట :-** యాజకులు, లేవీయులు తమ్మును గుమ్మములను, ప్రాకారమును పవిత్రపరచుట మందిరమును పవిత్రపరచుట ముగించి స్తోత్రగీతములు పాడుటకు రెండు సమూహములుగా ఏర్పడిరి.

**32-37వ. యాజకులు, లేవీయులతో వెళ్ళిన ప్రధానులు, బంధువులు, ఇతరులు :-** యాజకులు, లేవీయులతో వెళ్ళిన ప్రధానులు, బంధువులు, ఇతరులు వాద్యములను వాయించుటకు, బాకాలు ఊదుటకు శాస్త్రియగు ఎజ్రాయును ఊట గుమ్మముదగ్గర తూర్పువైపు నీటిగుమ్మమునకు పోయిరి.

**38-40వ. రెండవ సమూహము నెహెమ్యాతో కలిసి వెళ్ళిన మార్గము :-** రెండవ సమూహము నెహెమ్యాతో కలిసి ప్రాకారము మీదనున్న కొలుముల గోపురము ఎఫ్రాయిము గుమ్మము పాత గుమ్మము మత్స్యపు గుమ్మము హనన్యేలు మేయూ గోపురమునుండి, గొఱ్ఱెల గుమ్మము వరకు వెళ్ళి బందీగృహపు గుమ్మములోనికి వెళ్ళి నిలిచిరి.

**41-42వ. యాజకులు బాకాలు పట్టుకొనుట, గాయకులు బిగ్గరగా పాడుట :-** 18 మంది యాజకులు బాకాలు పట్టుకొనగా, గాయకులు బిగ్గరగా పాటలు పాడిరి. వీరి పేరులు, వాటి అర్థములను ఆత్మీయముగా ధ్యానించుట మంచిది.

**43-44వ. గొప్ప బలులు అర్పించి భార్యలు పిల్లలు కూడా ఆనందముతో సంతోషించిరి:-** దేవుడు తమకు మహానందము కలుగజేసెనని ఆ దినమున వారు గొప్ప బలులు అర్పించి భార్యలు, పిల్లలు కూడా సంతోషించిరి. యాజకులు, లేవీయుల కొరకు ప్రతిష్ఠార్పణలు, ప్రథమ ఫలములు, పదియవ వంతులు సమకూర్చుటకు నిర్ణయించబడిరి. వారి భార్యలు, పిల్లలు సంతోషించిరి. అందువలన యెరూషలేములో పుట్టిన ఆనంద ధ్వని బహు దూరమునకు వినబడెను. సేవ చేయుటకు నియమింపబడిన యాజకులు, లేవీయులనుబట్టి యూదులు సంతోషించిరి. యాజకులు, లేవీయుల కొరకు ప్రతిష్ఠార్పణలు, ప్రథమ ఫలములు, పదియవ వంతులు సమకూర్చుటకు ఏర్పాటు చేయబడెను.

**45-47వ. గాయకులు, ద్వారపాలకులు తమ పనిచేయుట :-** మరియు గాయకులు, ద్వారపాలకులు, దావీదును అతని కుమారుడైన సొలొమోను ఆజ్ఞాపించినట్లు దేవుని గూర్చిన పనులను, తమ శుద్ధిని గూర్చిన పనులను నెరవేర్చగా, గాయకులు, లేవీయుల నిమిత్తమైన అర్పణలను అర్పించి అహరోను వంశస్థులకు ప్రతిష్ఠించిరి.

# నెహెమ్యా గ్రంథములోని ప్రార్థనలు

1. 1:4వ. ఈ మాటలు వినినప్పుడు నేను కూర్చుండి యేడ్చి, కొన్ని దినములు దు:ఖముతో ఉపవాసముండి, ఆకాశమందలి దేవుని యెదుట విజ్ఞాపన చేసితిని.
2. 2:4వ. అప్పుడు రాజు ఏమి కావలసి నీవు మనవి చేయుచున్నావని నన్నడుగగా, నేను ఆకాశమందలి దేవునికి ప్రార్థన చేసితిని...
3. 4:4వ. మా దేవా ఆలకించుము, మేము తిరస్కారము నొందినవారము; వారి నింద వారి తలలమీదికి వచ్చునట్లుచేసి, వారు చెరపట్టబడినవారై వారు నివసించు దేశములోనే వారిని దోపునకు అప్పగించుము.
4. 5:19వ. నా దేవా, ఈ జనులకు నేను చేసిన సకలమైన ఉపకారములనుబట్టి నాకు మేలు కలుగునట్లుగా నన్ను దృష్టించుము.
5. 6:9వ. దేవా, ఇప్పుడు నా చేతులను బలపరచుము.
6. 6:14వ. నా దేవా, వారి క్రియలను బట్టి టోబీయాను సన్బల్లటును నన్ను భయపెట్టవలెనని కనిపెట్టియున్న ప్రవక్తలను, నోవద్యా అను ప్రవక్తిని జ్ఞాపకము చేసికొనుము.
7. 9:7వ. దేవా యెహోవా, అబ్రామును ఏర్పరచుకొని, కల్దీయుల ఊరు అను స్థలము నుండి ఇవతలకు అతని రప్పించి అతనికి అబ్రాహామను పేరు పెట్టినవాడవు నీవే.
8. 10-39వ. మా దేవుని మందిరమును మేము విడిచిపెట్టము.
9. 13-14వ. నా దేవా, ఈ విషయములో నన్ను జ్ఞాపకముంచుకొని, నా దేవుని మందిరమునకు దాని ఆచారముల జరుగుబాటునకును నేను చేసిన ఉపకారములను మరువకుండుము.
10. 13:22వ. నా దేవా, యిందును గూర్చియు నన్ను జ్ఞాపకముంచుకొని నీ కృపాతిశయము చొప్పున నన్ను రక్షించుము.
11. 13:29వ. నా దేవా, వారు యాజక ధర్మమును, యాజక ధర్మపు నిబంధనను, లేవీయుల నిబంధనను అపవిత్రపరచిరి గనుక వారిని జ్ఞాపకముంచుకొనుము.
12. 13:31వ. నా దేవా, మేలుకై నన్ను జ్ఞాపకముంచుకొనుము.

# నెహెమ్యా 13వ అధ్యాయము (3+6+4+9+9=31వ.)

## అంశము :- అన్యస్త్రీలను వివాహము చేసికొనిన వారిని దిద్దుట.

**1-3వ. అన్య స్త్రీలను వివాహము చేసికొనిన మిశ్రిత జనమును ఇశ్రాయేలీయులలో నుండి వెలివేయుట :-**

ప్రధాన యాజకుడును ఎల్యాషీబు కుమారుడునైన యోయాదా కుమారులలో ఒకడు హోరోనీయుడైన సన్బల్లటు కుమార్తెను పెండ్లాడి సన్బల్లటునకు అల్లుడాయెను. హెూరోనీయుడైన సన్బల్లటు ఇశ్రాయేలీయులకు శత్రువులైన ముగ్గురులో మొదటివాడు.

1. హోరోనీయుడైన సన్బల్లటు (సాతానుకు గురుతు ?) = రహస్యమైన ముల్లు.
2. అమ్మోనీయుడైన (లోతు సంతానము), టోబీయా లోకమునకు గురుతు=దయాళుడు
3. అరబీయుడైన (అబ్రహాము సంతానము) గెషెము శరీరమునకు గురుతు = గాలి, వాన.

ఈ ముగ్గురిని సాతాను, శరీరము, లోకముతో పోల్చవచ్చును... ఈ ముగ్గురు మనలను వశపరచుకొని దేవునికి వ్యతిరేకముగా మనము ప్రవర్తించుటకు ప్రేరేపించుదురు. మనము నెహెమ్యావలె జాగ్రత్తగా ఉండాలి.

ఆ దినమందు వారు మోషే గ్రంథము జనులకు చదివి వినిపించగా అందులో అమ్మోనీయులు గాని మోయాబీయులుగాని దేవుని యొక్క సమాజమును ఎన్నటికి చేరకూడదు. వారు అన్నపానములు తీసికొని ఇశ్రాయేలీయులకు ఎదురుపడక వారిని శపించమని బిలామును ప్రోత్సాహపరచిరి. అయినను మన దేవుడు ఆ శాపమును ఆశీర్వాదముగా మార్చెనని వ్రాయబడినట్లు కనబడెను. జనులు ధర్మశాస్త్రమును వినినప్పుడు మిశ్రితజనమును తమలో నుండి వెలివేసిరి.

**4-9వ. ప్రధాన యాజకుడును ఎల్యాషీబు కుమారుడునైన యోయాదా కుమారునికి మామయగు టోబీయా యొక్క సామగ్రియంతయు బయట పారవేయుట :-**

4-5వ. దేవుని మందిరపుగది మీద నిర్ణయింపబడిన యాజకుడగు ఎల్యాషీబు తన కుమారునికి టోబీయా కుమార్తెతో వివాహము చేసి బంధుత్వము కలుగజేసికొనెను. యాజకుల కొరకు ప్రజలు తేవలసిన ప్రతిష్ఠిత వస్తువులను ఉంచు స్థలమునొద్ద, నెహెమ్యా యెరూషలేములో లేని సమయమున టోబీయాకు ఒక గదిని సిద్ధము చేసెను.

6-9వ. ఆ సమయములో నెహెమ్యా రాజును దర్శించి రాజునొద్ద సెలవు పుచ్చుకొని యెరూషలేమునకు వచ్చి ఎల్యాషీబు దేవుని మందిరములో టోబీయాకు ఒకగది యేర్పరచిన సంగతి తెలిసికొని దు:ఖపడెను. నెహెమ్యా ఆ గదిలోనుండి టోబీయా యొక్క సామగ్రియంతయు అవతల పారవేసి, గదులన్నియు యాజకులచే శుభ్రము చేయించెను. నెహెమ్యా మందిరపు పాత్రలను నైవేద్య పదార్థములను అక్కడికి తెప్పించెను.

**10-13వ. లేవీయులకు ఆహారము పంచిపెట్టు పని నెహెమ్యా ఏర్పరచుట :-**

10-11వ. మరియు లేవీయులకు రావలసిన పాళ్లు వారికి అందకపోవుటచేత సేవచేయు లేవీయులును గాయకులును తమ పొలములకు పారిపోయిరని నెహెమ్యా తెలిసికొని అధిపతులతో పోరాడి దేవుని మందిరమును ఎందుకు లక్ష్యపెట్టలేదని అడిగెను.

12-13వ. యూదుల చేత ధాన్య ద్రాక్షారస తైలములలో పదియవ భాగమును నెహెమ్యా ఖజానాలోనికి తెప్పించెను. నమ్మకముగలవాడని పేరుపొందిన షెలెమ్యా, సాదోకు, పెదాయాను వారి చేతిక్రింద హానాను ఖజానామీద నెహెమ్యా కాపరులుగా నియమించెను. తమ సహోదరులకు ఆహారము పంచిపెట్టు పని వారికి నెహెమ్యా నియమించెను. పొలములకు పారిపోయిన లేవీయులను మందిరమునకు రప్పించెను.

**14-22వ. విశ్రాంతి దినమును నిర్లక్ష్యపెట్టి ఇశ్రాయేలీయులు తమ మీదికి దేవుని కోపము తప్పించుచున్నాడని ఇశ్రాయేలీయులకు చెప్పుట :-**

14-16వ. దేవుని మందిరమును దాని ఆచారములను మరచి ఆ దినములలో యూదులలో కొందరు విశ్రాంతిదినమున ద్రాక్షారసమును ద్రాక్షపండ్లను, అంజూరపు పండ్లను నానా విధములైన బరువులను విశ్రాంతిదినమున యెరూషలేములోనికి తీసికొని వచ్చి అమ్మినవారిని గద్దించెను. 17-19వ. అంతట యూదుల ప్రధానులను నేనెదురాడి విశ్రాంతి దినమును నిర్లక్ష్యపెట్టి మీరెందుకు ఈ దుష్కార్యమును చేయుదురు? మీరును పితరులును విశ్రాంతి దినమును నిర్లక్ష్యపెట్టి దేవుని యొద్దనుండి యీ పట్టణస్థుల మీదికి కోపము మరి అధికముగా రప్పించుచున్నారని చెప్పెను. విశ్రాంతి దినమునకు ముందు చీకటి పడినప్పుడు యెరూషలేము గుమ్మములను మూసివేసి విశ్రాంతి దినము గడుచువరకు ఏ బరువైనను లోపలికి రాకుండా వాటిని తియ్యకూడదని ఆజ్ఞాపించి తనపనివారిలో కొందరిని కావలి యుంచెను. 20-22 వ. వర్తకులును నానా విధములైన వస్తువులను అమ్మువారును ఒకటిరెండు మారులు యెరూషలేము అవతల బసచేసికొనగా

నెహెమ్యా వారిని గద్దించి ఇంకొకసారి ఈలాగు చేసినయెడల మిమ్మును పట్టుకొందునని చెప్పెను. అప్పటినుండి విశ్రాంతి దినమున వారు మరిరాలేదు. తమ్మును తాము పవిత్రపరచుకొని విశ్రాంతి దినమును ఆచరించవలెనని లేవీయులకు నెహెమ్యా ఆజ్ఞాపించెను. నీ కృపాతిశయము చొప్పున మమ్మును రక్షించుమని దేవుని ప్రార్థించెను.

**23-31వ. అన్యస్త్రీలను వివాహము చేసికొని పాపము చేయకూడదని హెచ్చరించుట:-**

23-26వ. ఆ దినములలో అష్డోదు అమ్మోను మోయాబు సంబంధులగు అన్య స్త్రీలను వివాహము చేసికొనిన కొందరు యూదులు నెహెమ్యాకు కనబడిరి. వారు ఆ యా భాషలు మాటలాడువారు గాని యూదుల భాష వారిలో ఎవరికిని రాదు. 25 అంతట నేను వారితో వాదించి వారిని శపించి కొందరినికొట్టి వారి తలవెండ్రుకలకు పెరికివేసి మీరు వారి కుమారులకు మీ కుమార్తెలను ఇయ్యకయు, మీ కుమారులకైనను మీకైనను వారి కుమార్తెలను పుచ్చుకొనకయు ఉండవలెనని వారిచేత దేవుని పేరిట ప్రమాణము చేయించాడు. సొలొమోను దేవునిచేత ప్రేమింపబడినవాడై ఇశ్రాయేలీయులందరి మీద రాజుగా నియమింపబడిన తరువాత అనేక అన్యస్త్రీలను వివాహమాడగా అన్యస్త్రీలు అతనిచేత పాపము చేయించారు.

27-29వ. ప్రధాన యాజకుడు ఎల్యాషీబు కుమారుడునైన యోయాదా కుమారులలో ఒకడు హోరోనీయుడైన సన్బల్లటునకు అల్లుడాయెను. దానినిబట్టి నెహెమ్యా అతనిని తరిమివేసెను. ఇంత గొప్ప కీడు చేయునట్లును అన్యస్త్రీలను వివాహము చేసికొని దేవునికి విరోధముగా పాపము చేసిన మీవంటివారి మాటలను ఆలకించమని చెప్పెను. 29 నా దేవా, వారు యాజక ధర్మమును, యాజక ధర్మపు నిబంధనను, లేవీయుల నిబంధనను అపవిత్రపరచిరి గనుక వారిని జ్ఞాపకముంచుకొనుమని ప్రార్థించెను.

30-31వ. ఈలాగున వారు ఏ పరదేశులలోను కలియకుండ వారిని పవిత్రపరచి, ప్రతి యాజకుడును ప్రతి లేవీయుడును విధి ప్రకారముగా సేవచేయునట్లు కావలసి వచ్చినప్పుడెల్ల కట్టెల అర్పణను ప్రథమ ఫలములను తీసికొనివచ్చునట్లుగా నెహెమ్యా వారికి నియమించితిని. నా దేవా, మేలుకై నన్ను జ్ఞాపకముంచుకొనుమని దేవుని ప్రార్థించెను.

# వాక్యానుసారమైన విశ్వాసుల వివాహాలు – కుటుంబ జీవితములు కట్టబడుట

విశ్వాసుల వివాహాలు దేవుని చిత్త ప్రకారము జరగాలి. ఇది దేవుని చిత్తమని విశ్వాసిలో ఉన్న దేవుని ఆత్మ తనలో ఉన్న మనుష్యాత్మతో చెప్పును. అప్పుడు హృదయములో సమాధానము కలుగును. దేవుని చిత్తము బైబిలు వాక్యప్రకారముగా ఉండును.

**దేవుని చిత్తము :-** ఆది 1:26 దేవుడు మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము; 27 దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాని, పురుషునిగాని వారిని సృజించెను. ఆది 2:18 దేవుడైన యెహోవా నరుడు ఒంటరిగా నుండుట మంచిది కాదు; వానికి సాటియైన సహాయమును వానికొరకు చేయుదునను కొనెను. ఆమెయే నిజమైన సరియైన సహకారి.

**దేవుని చిత్తము వలన జరిగిన ఇస్సాకు వివాహము :-** ఆది 24:3 నేను ఎవరి మధ్య కాపురమున్నానో ఆ కనానీయుల కుమార్తెలలో ఒకదానిని నా కుమారునికి పెండ్లి చేయక 4 నా స్వదేశమందున్న నా బంధువుల యొద్దకు (విశ్వాస గృహమునకు) వెళ్లి ఇస్సాకను నా కుమారునికి భార్యను తెచ్చునట్లు ఆకాశము యొక్క దేవుడును భూమి యొక్క దేవుడునైన యెహోవా తోడని నీ చేత ప్రమాణము చేయించెదననెను. ఆది 24:50 లాబానును బెతూయేలును ఇది యెహోవా వలన కలిగిన కార్యము, మేమైతే అవునని గాని కాదనిగాని చెప్పజాలము. ఇది దేవుని చిత్త ప్రకారమైన వివాహము.

హెబ్రీ 13:4 వివాహము అన్ని విషయములలో ఘనమైనదిగాను, పానుపు నిష్కల్మషమైనదిగా ఉండవలెను; వేశ్యాసంగులకును, వ్యభిచారులకును దేవుడు తీర్పు తీర్చును. వివాహము అనగా వివాహము తదుపరి జీవితము అన్ని విషయములలో ఘనమైనదిగాను అనుట, ఎవరిని వివాహమాడాలి అను తీర్మానమునుండి అన్ని విషయములలో దేవుని చిత్త ప్రకారముండుటయే ఘనమైనదని గమనించాలి. అలాగే పానుపు విషయములోను ఘనమైనదిగాను ఉండాలి, అనుటలో వివాహమునకు ముందు ప్రధానమునకు ముందుకాని తరువాత కాని సహజీవనము చేయుట పానుపులో పాల్గొనుట పాపమని గుర్తించాలి. ఆది 24:67 ఇస్సాకు తల్లియైన శారా గుడారములోనికి ఆమెను తీసికొనిపోయెను. అట్లు అతడు రిబ్కాను పరిగ్రహింపగా ఆమె అతనికి భార్య ఆయెను; అతడు ఆమెను ప్రేమించెను. ప్రేమ పానుపులు వివాహము తరువాతనే ఉండాలని గుర్తించండి.

2 కొరిం 6:14 మీరు అవిశ్వాసులతో జోడుగా ఉండకుడి. నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము ? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు ? 15 క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము ? అవిశ్వాసితో విశ్వాసికి పాలెక్కడిది ? 16 దేవుని ఆలయమునకు విగ్రహములతో

ఏమి పొందిక ? మనము దేవుని ఆలయము. దేవుడిలాగు సెలవిచ్చు చున్నాడు. నేను వారిలో నివసించి సంచరింతును; నేను వారి దేవుడనై యుందును వారు నా ప్రజలైయుందురు. 17 కావున మీరు వారి మధ్యనుండి బయలు వెడలి ప్రత్యేకముగా ఉండుడి; అపవిత్రమైన దానిని ముట్టకుడని ప్రభువు చెప్పుచున్నాడు. లేవీ 20:26లో మీరు నాకు పరిశుద్ధులైయుండవలెను. యెహోవా అను నేను పరిశుద్ధుడను. మీరు నావారై యుండునట్లు అన్యజనులలో నుండి మిమ్మును వేరుపరచితిని అన్నాడు. వివాహ విషయములోను ప్రత్యేకముగా ఉండాలి.

**దేవుని ఆత్మ మన ఆత్మతో చెప్పుట :-** యెషయా 30:21 మీరు కుడితట్టయినను ఎడమ తట్టయినను తిరిగినను ఇదే త్రోవ. దీనిలో నడుపుడి అని నీ వెనుకనుండి యొక శబ్దము నీ చెవులకు వినబడును. ఇది నీ మనస్సాక్షిలో సాక్ష్యము.

**వాక్యముతో స్థిరపరచుట :-** దేవుడు తన చిత్తమును దేవుని యొద్ద కనిపెట్టుకొని ఉన్నవారికి వాక్యము ద్వారా కూడా బయలుపరచును.

**హృదయములో సమాధానము :-** యాకో 3:17. పై నుండి వచ్చు జ్ఞానము మొదట పవిత్రమైనది, సమాధానకరమైనది, మృదువైనది, సులభముగా లోబడునది, కనికరముతోను మంచి ఫలములతోను నిండుకొనినది. కనుక దేవుని చిత్తప్రకారము జతపరచబడినవారు జీవితకాలమంత మంచి ఫలములతో నిండుకొనియుందురు. దేవుని చిత్తములో పైన చెప్పినదంతయు నుండును. ఉదాహరణగా దేవుని చిత్తప్రకారము జరిగిన వివాహాలు.

1) నిర్గ 2:1 లేవి వంశస్థుడొకడు వెళ్లి లేవి కుమార్తెను వివాహము చేసికొనెను. 2) యెషయా 8:3 నేను ప్రవక్త యొద్దకుపోతిని; ఆమె గర్భవతియై కుమారుని కనినది.

**ప్రత్యేకముగా లేనివారు :- (దేవుని చిత్త ప్రకారము జరుగని వివాహములు)**


1) ఆది 26:34. ఏశావు నలువది సంవత్సరములవాడైనప్పుడు హిత్తీయుడైన బేయేరీ కుమార్తెయగు యహూదీతును హిత్తీయుడైన ఏలోను కుమార్తెయగు బాశెమతును పెండ్లిచేసికొనెను. 2) ఆది 28:8 ఇదిగాక కనాను కుమార్తెలు తన తండ్రియైన ఇస్సాకునకు ఇష్టురాండ్రు కారని ఏశావునకు తెలిసినప్పుడు 9 ఏశావు ఇష్మాయేలు నొద్దకు వెళ్లి, తనకున్న భార్యలుగాక అబ్రహాము కుమారుడైన ఇష్మాయేలు కుమార్తెయు నెబాయోతు సహోదరియైన మహలతును కూడ పెండ్లి చేసికొనెను. 35 వీరు ఇస్సాకునకును రిబ్కాకును మనోవేదన కలుగజేసిరి. 3) హోషే 7:8 ఎఫ్రాయిము అన్యజనులతో కలసిపోయెను (వివాహ విషయంలో కూడా) ఎఫ్రాయిము ఎవరును త్రిప్పివేయని అప్పమువంటి వాడాయెను.

**వివాహము ద్వారా జతపరచబడినవారు మనుష్యుల చేత వేరుపరచబడకూడదు :-** మత్త 19:5 (వివాహములో) పురుషుడు తల్లిదండ్రులను విడిచి తన భార్యను హత్తుకొనును,

వారిద్దరును ఏకశరీరముగా ఉందురు. 6 కాబట్టి వారికను ఇద్దరుకాక ఏకశరీరముగా ఉన్నారు గనుక దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరుపరచకూడదని యేసుప్రభువు చెప్పెను. 1 కొరిం 7:39 భార్య తన భర్త బ్రదికియున్నంత కాలము బద్ధురాలైయుండును, భర్త మృతిపొందిన యెడల ఆమె కిష్టమైనవానిని పెండ్లి చేసికొనుటకు స్వతంత్రురాలై యుండునుగాని ప్రభువునందు మాత్రమే పెండ్లిచేసికొనవలెను. 1 కొరిం 7:12 ప్రభువు కాదు నేనే తక్కినవారితో చెప్పునదేమనగా ఏ సహోదరునికైన అవిశ్వాసురాలైన భార్యయుండి, ఆమె అతనితో కాపురము చేయనిష్టపడిన యెడల, అతడు ఆమెను పరిత్యజింపకూడదు. 13 మరియు ఏ స్త్రీకైనను అవిశ్వాసియైన భర్తయుండి, ఆమెతో కాపురముచేయ నిష్టపడిన యెడల, ఆమె అతని పరిత్యజింపకూడదు. ఇప్పుడైతే 15 అవిశ్వాసియైనవాడు ఎడబాసిన ఎడబాయ వచ్చును; అట్టి సందర్భములలో సహోదరుని కైనను, సహోదరికైనను నిర్బంధము లేదు. సమాధానముగా ఉండుటకు దేవుడు మనలను పిలిచెను. 16 ఓ స్త్రీ, నీ భర్తను రక్షించెదవో లేదో నీకేమి తెలియును? ఓ పురుషుడా, నీ భార్యను రక్షించెదవో లేదో నీకేమి తెలియును ? 1 పేతు 3:1 అటువలె స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడియుండుడి; 2 అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతో కూడిన మీ పవిత్ర ప్రవర్తన చూచి, వాక్యములేకుండానే తమ భార్యల నడవడివలన రాబట్టబడ వచ్చును.

**భార్యలు భర్తలకు లోబడియుండుట :-** ఎఫె 5:22. స్త్రీలారా, ప్రభువునకువలె మీ సొంత పురుషులకు లోబడియుండుడి. 23 క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సైయున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడైయున్నాడు. ఎఫె 5:31 ఈ హేతువుచేత పురుషుడు తన తండ్రిని, తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారిద్దరును ఏకశరీరమగుదురు. 32 ఈ మర్మము గొప్పది; అయితే నేను క్రీస్తును గూర్చియు సంఘమును గూర్చి చెప్పుచున్నాను. క్రీస్తు సంఘమును ఎప్పుడైనను విడిచిపెట్టునా ? అలాగే భర్తలు భార్యలను, భార్యలు భర్తలను ఎట్టి పరిస్థితిలోను విడిచిపెట్టకూడదు. 1 కొరిం 11:3 ప్రతి పురుషునికి శిరస్సు క్రీస్తనియు, స్త్రీకి శిరస్సు పురుషుడనియు, క్రీస్తునకు శిరస్సు దేవుడనియు మీరు తెలిసికొనవలెనని కోరుచున్నాను. 1 కొరిం 11:8 ఏలయనగా స్త్రీ పురుషుని నుండి కలిగెనేగాని పురుషుడు స్త్రీ నుండి కలుగలేదు. 9 మరియు స్త్రీ పురుషుని కొరకే గాని పురుషుడు స్త్రీకొరకు సృష్టింపబడలేదు. 10 ఇందువలన దేవదూతలను బట్టి అధికార సూచన స్త్రీకి తలమీద ఉండవలెను. 11 అయితే ప్రభువునందు స్త్రీకి వేరుగా పురుషుడు లేడు, పురుషునికి వేరుగా స్త్రీ లేదు. స్త్రీ పురుషుని నుండి ఏలాగు కలిగెనో అలాగే పురుషుడు స్త్రీ మూలముగా కలిగెను, గాని సమస్తమైనవి దేవుని మూలముగా కలిగియున్నవి.

**- వరప్రసాదరెడ్డి**




శ్రీలత ఆఫ్‌సెట్, తెనాలి. 9247872191